E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 23-09-2025 (వారం) మంగళవారం

హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



చర్చోపచర్చలు! » 3లో

## హైదరాబాద్‌పై వరుణ ప్రతాపం

- సాయంత్రం 4 నుంచి రాత్రి 10 వరకు జడివాన
- చెరువుల్లా మారిన రోడ్లు.. పలుచోట్ల కొట్టుకుపోయిన టూవీలర్లు
- గంటలకొద్దీ కి.మీ. మేర స్తంభించిన ట్రాఫిక్.. సీఎం కాన్వాయ్‌కూ తప్పని ట్రా‘ఫికర్’
- సచివాలయం నుంచి జూబ్లీహిల్స్ వరకు కాన్వాయ్‌లో 13 నిమిషాల ప్రయాణానికి గంటంపావు సమయం
- బంజారాహిల్స్‌లో అత్యధికంగా 10.5 సెం.మీ. వర్షపాతం
- పలు జిల్లాల్లోనూ కుండపోత.. పిడుగుపాట్లకు ఇద్దరు మృతి



ఈకబురు, హైదరాబాద్ : భాగ్యనగరాన్ని వరుణుడు బెంబేలెత్తించాడు. హోరు వానతో నగరాన్ని అతలాకుతలం చేశాడు. సోమవారం సాయంత్రం 4 గంటలకు ఉరుములు మెరుపులతో మొదలైన మేఘగర్జన రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోని బస్తీలు నీటమునిగాయి. పలు ప్రాంతాల్లో వరద ఉధృతికి రహదారుల పక్కన నిలిపిన వాహనాలు కొట్టుకుపోయాయి. ఓపెన్ నాలాలు, మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లాయి. ఫలితంగా రోడ్లన్నీ చెరువులను తలపించడంతో ట్రాఫిక్ పూర్తిగా అస్తవ్యస్తమైంది.

గంటలకొద్దీ, కిలోమీటర్ల మేర ఎక్కడికక్కడ వాహనాలు స్తంభించిపోయాయి. విజయవాడ, వరంగల్, ముంబై, బెంగళూరు, కరీంనగర్ వెళ్లే మార్గాల్లో ఇళ్లకు, ఆఫీసులకు బయలుదేరిన వాహనదారులు ముందుకు కదల్లేక నానా అవస్థలు పడ్డారు. ప్రధానంగా అసెంబ్లీ నుంచి ఖైరతాబాద్, మెహిదీపట్నం నుంచి మాసాబ్ ట్యాంక్, ఎల్బీ నగర్ నుంచి మలక్‌పేట వరకు కేవలం కిలోమీటర్ ప్రయాణానికి గంటలకొద్దీ సమయం పట్టింది. రాత్రి 10 గంటల వరకు అత్యధికంగా బంజారాహిల్స్‌లో సుమారు 10.5 సెం.మీ. వర్షం కురవగా శ్రీనగర్ కాలనీలో 9.9 సెం.మీ., ఖైరతాబాద్‌లో 8.9 సెం.మీ. వర్షం కురిసింది.

తరువాయి 2లో



## అక్టోబరులోపు అడ్డంకులు అధిగమించాలి


- ఎన్‌హెచ్ ప్రాజెక్టుల్లో భూసేకరణ, పరిహారంలో జాప్యం తగదు
- అటవీ అనుమతులపై కేంద్ర మంత్రులతో మాట్లాడతా
- ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం వరకు ఎలైన్‌మెంట్ ఖరారు చేయాలి
- అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

తరువాయి 2లో


మన మార్కెట్లకు బలం దేశీయ పెట్టుబడులే » 4లో



విరామం వచ్చినా.. ఎంపికలు మార్పు » 5లో



బాంబే వస్తున్నా.. తలలు జాగ్రత్త » 5లో



మా ఆటే మాట్లాడుతుంది » 6లో





## మరో ఏడాది అణ్వస్త్ర పరిమితికి కట్టుబడతాం: పుతిన్

తరువాయి 3లో



## ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి

తరువాయి 3లో

## సమ్మక్క సాగర్‌కు ఛత్తీస్‌గఢ్‌సై

- న్వోసీ జారీకి సూత్రప్రాయ అంగీకారం
- ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్ సాయ్‌తో మంత్రి ఉత్తమ్ భేటీ
- పరిహారం చెల్లింపు, పునరావాస చర్యలపై హామీ



ఈకబురు,హైదరాబాద్: సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నిర్మాణంపై తమకెలాంటి అభ్యంతరం లేదని ధ్రువీకరించేందుకు ఛత్తీస్‌గఢ్ సుముఖత వ్యక్తం చేసింది. తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజినీర్ల బృందంతో కలిసి సోమవారం రాయ్‌పూర్ వెళ్లారు. ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్ సాయ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు నిరభ్యంతర పత్రం మంజూరు చేసేందుకు విష్ణుదేవ్ సాయ్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. ములుగు జిల్లాలోని తుపాకులగూడెం సమీపంలో గోదావరిపై నిర్మిస్తున్న ఈ బ్యారేజీలో 6.7 టీఎంసీల నీటిని నిల్వ చేయనున్నామని ఉత్తమ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుపై మంత్రి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

పరిహారం చెల్లించడానికి సిద్ధం

తరువాయి3లో

## కష్టమైన పనులను గాలికొదిలేసింది




- అది ఆ పార్టీకి వారసత్వంగా వచ్చిన అలవాటు
- అందుకే ఈశాన్యభారతం ఎంతో కోల్పోయింది
- కాంగ్రెస్‌పై ప్రధాని ధ్వజం
- త్రిపుర, అరుణాచల్‌లో అభివృద్ధి ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన

ఈకబురు, ఈటానగర్/అగర్తలా: ఈశాన్య భారతంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా గత కాంగ్రెస్ ప్రభుత్వాలపై ప్రధాని మోదీ విమర్శల వర్షం కురిపించారు. ఈశాన్యభారతంలో పర్యటనలో భాగంగా సోమవారం ప్రధాని త్రిపుర, అరుణాచల్‌ప్రదేశ్‌లలో రూ.5,100 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఈటానగర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ‘‘అరుణాచల్‌ప్రదేశ్‌లో కేవలం రెండు లోక్‌సభ స్థానాలే ఉన్నాయి. రాజకీయంగా ఈ రెండు సీట్లతో తమకు ఎలాంటి ప్రయోజనంలేదని కాంగ్రెస్ ఎప్పుడో భావించింది. ఈశాన్యభారతంలో కష్టమనిపించిన ఏ అభివృద్ధి ప్రాజెక్టు, పనినీ కాంగ్రెస్ భుజాలకెత్తుకోలేదు. కొండలు, అటవీప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టడం సవాళ్లతో కూడిన పని. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈశాన్య రాష్ట్రాలను వెనుకబడిన ప్రాంతాలుగా ప్రకటించి చేతులు దులుపుకున్నాయి. అభివృద్ధి పనులను వదిలేసే కాంగ్రెస్ నిర్లక్ష్యపూరిత్వం కారణంగా ఈశాన్యభారతం అభివృద్ధికి అస్సలు నోచుకోలేదు. ఇలా పనులను గాలికొదిలేయడం కాంగ్రెస్‌కు వారసత్వంగా వచ్చిన దురలవాటు. కాంగ్రెస్ కారణంగా నిర్లక్ష్యానికి గురైన అరుణాచల్‌ప్రదేశ్‌ను ఢిల్లీలో కూర్చుని పరిపాలిస్తే సరిపోదని నాకు అర్థమైంది. అందుకే రాష్ట్రానికి తరచూ కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులను పంపించా.

తరువాయి2లో

## ఆర్ఆర్ఆర్ బాధితుల పక్షాన పోరాడతాం

» 2లో





## సింగరేణి కార్మికులకు లాభంలో 34% చెల్లించాలి

» 3లో

తరువాయి2లో

## దక్కన్ సిమెంట్స్‌లో కార్మికుల

- పోలీసులపై దాడి.. వాహనం అద్దాల ధ్వంసం
- మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి సాయం చేయాలని డిమాండ్

» 2లో



మొదటి పేజీ తరువాయి

# హైదరాబాద్‌పై వరుణ ప్రతాపం



9.9 సెం.మీ., ఖైరతాబాద్‌లో 8.9 సెం.మీ. వర్షం కురిసింది.
శ్రీనగర్, ఖైరతాబాద్, మైత్రివనం, యూసుఫ్‌గూడ, వనస్థలిపురం, హయత్‌నగర్, బహదూర్‌పురా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఇక నగరు శివారు ప్రాంతాల్లోనూ వర్షం దంచికొట్టింది. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి ఇంజాపూర్–తొర్రూర్ మార్గంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు వరదలో చిక్కుకున్నారు. మున్సిపల్ సిబ్బంది అతికష్టం మీద వారిని కాపాడారు. వరదలో కొట్టుకుపోయిన కారు కొద్ది దూరంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు తగిలి ఆగిపోయింది.

సీఎం కాన్వాయ్‌కూ తప్పని ట్రాఫిక్ తిప్పలు..
కుండపోత వర్షంతో రోడ్లన్నీ జలమయం కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ సైతం ట్రాఫిక్‌లో చిక్కుకొని నత్తనడకన ముందుకు సాగింది. సాయంత్రం 6:30 గంటలకు సీఎం సచివాలయం నుంచి జూబ్లీహిల్స్‌లోని తన ఇంటికి బయల్దేరగా ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా వీవీ స్టాచ్యూ వద్దకు రాగానే ఖైరతాబాద్ కూడలిలో ట్రాఫిక్ స్తంభించింది. అక్కడి నుంచి ఖైరతాబాద్, కేసీపీ జంక్షన్, ఎర్రమంజిల్ తాజ్ కృష్ణా, వెంగళ్‌రావు పార్కు, ఎన్‌ఎఫ్‌సీఎల్ చౌరస్తా, పంజగుట్ట శ్మశానవాటిక, టీవీ 9 మీదుగా సాగర్ సొసైటీ, కేబీఆర్ పార్కు చౌరస్తా వరకు కాన్వాయ్ ముందుకు కదిలేందుకు చాలా సమయం పట్టింది.
సరిగ్గా 7:25 గంటలకు సీఎం కాన్వాయ్ కేబీఆర్ పార్కు చౌరస్తాలో ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. కేబీఆర్ పార్కు చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ చౌరస్తాకు వెళ్లేందుకు 20 నిమిషాలు పట్టింది. జూబ్లీహిల్స్ చౌరస్తా నుంచి సీఎం ఇంటికి వెళ్లకుండా కేబుల్ బ్రిడ్జి మీదుగా మెడికవర్ ఆస్పత్రికి వెళ్లారు. సరిగ్గా 8 గంటలకు ఆయన మెడికవర్ ఆస్పత్రికి చేరుకున్నారు. వాస్తవానికి సచివాలయం నుంచి సీఎం నేరుగా తన ఇంటికి వెళ్లేందుకు 13 నిమిషాల సమయం పడుతుంది.

కేబీఆర్ పార్కు చౌరస్తాలో నిలిచిపోయిన సీఎం కాన్వాయ్
కానీ సోమవారం సాయంత్రం ఆయన జూబ్లీహిల్స్ దాటడానికే గంటంపావు సమయం పట్టింది. అయితే తన కోసం వాహనదారులను ఇబ్బంది పెట్టొద్దని.. తాను ట్రాఫిక్‌లో ఇరుక్కున్నా పరవాలేదని పోలీసులను ఆదేశించిన సీఎం రేవంత్.. గంటన్నరపాటు స్తంభించిన ట్రాఫిక్‌లోనే మెల్లగా ముందుకు కదిలారు.

జిల్లాల్లోనూ జోరు వాన
వరంగల్, ములుగు, సిద్దిపేట జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో సోమవారం పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చెల్పాక గ్రామంలో పొలం దున్నుతున్న రైతు ఊకే కృష్ణ (45) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందగా మరో రైతు పూనెం చిట్టిబాబు గాయపడ్డాడు. అలాగే వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం చంద్రయ్యపల్లి గ్రామంలో పొలంలో మిరప నారు వేస్తుండగా వర్షం కురుస్తోందని చెట్టు కింద నిలబడిన మొద్దు రాకేష్ (25)పై పిడుగుపడటంతో మృతిచెందాడు.
వరంగల్ నగరంలోని వరంగల్ అండర్‌బ్రిడ్జి, భవాని నగర్–వికాస్‌నగర్ కూడలి, అంబేడ్కర్ భవన్, హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ కూడలి, బస్‌స్టేషన్, కాకాజీ నగర్, హనుమకొండ, వరంగల్ చౌరస్తా ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో వాహనదారులు అవస్థలుపడ్డారు. సిద్దిపేట జిల్లా కొండపాకలో 8.5 సెం.మీ. వర్షం కురవగా కొమురవెల్లి మండల కేంద్రంలో 7.2, సిద్దిపేట పట్టణంలో 7.15 సెం.మీ. వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ శాఖ కార్యాలయంపై పిడుగు పడటం సుమారు రూ. 10 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

# కష్టమైన పనులను గాలికొదిలేసింది




రాజకీయంగా ఈ రెండు సీట్లతో తమకు ఎలాంటి ప్రయోజనంలేదని కాంగ్రెస్ ఎప్పుడో భావించింది. ఈశాన్యభారతంలో కష్టమనిపించిన ఏ అభివృద్ధి ప్రాజెక్టు, పనినీ కాంగ్రెస్ భుజాలకెత్తుకోలేదు. కొండలు, అటవీప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టడం సవాళ్లతో కూడిన పని. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈశాన్య రాష్ట్రాలను వెనుకబడిన ప్రాంతాలుగా ప్రకటించి చేతులు దులుపుకున్నాయి. అభివృద్ధి పనులను వదిలేసే కాంగ్రెస్ నిర్లక్ష్యాపర్వం కారణంగా ఈశాన్యభారతం అభివృద్ధికి అస్సలు నోచుకోలేదు. ఇలా పనులను గాలికొదిలేయడం కాంగ్రెస్‌కు వారసత్వంగా వచ్చిన దురలవాటు. కాంగ్రెస్ కారణంగా నిర్లక్ష్యానికి గురైన అరుణాచల్‌ప్రదేశ్‌ను ఢిల్లీలో కూర్చుని పరిపాలిస్తే సరిపోదని నాకు అర్థమైంది. అందుకే రాష్ట్రానికి తరచూ కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులను పంపించా. నేను కూడా ఈశాన్యభారతంలో ఇప్పటిదాకా 70 సార్లకుపైగా పర్యటించా. దశాబ్దకాలంలో చూస్తే మంత్రులు, అధికారులు 800 సార్లు పర్యటించారు.
రహదారులు నిర్మించడం అసాధ్యమని కాంగ్రెస్ భావించిన అదే చోట్ల ఇప్పుడు ఆధునిక రహదారులను నిర్మించాం. సేతు టన్నెల్‌నే తీసుకోండి. ఒకప్పుడు అది సాధ్యమని ఎవ్వరూ ఊహించలేదు. ఇప్పుడు ఇది అరుణాచల్‌ప్రదేశ్ గౌరవ గుర్తింపుగా నిలిచింది. హోలోంగి ఎయిర్‌పోర్ట్ సైతం కొత్త టర్మినల్‌తో అందుబాటులోకి వచ్చింది. ఇక్కడి నుంచి నేరుగా ఢిల్లీకి విమానసర్వీసులు ఉన్నాయి. ఈ అనుసంధాన ప్రాజెక్టులు ప్రయాణాలను సులభతరం చేశాయి. రైతులు తమ ఉత్పత్తులను పెద్ద మార్కెట్‌లకు తరలించగల్గుతున్నారు" అని మోదీ అన్నారు.

ఆ ఆలోచనను మార్చాలనుకున్నా
"2014లో తొలిసారిగా ప్రధానిగా దేశ సేవచేసే అవకాశం వచ్చినప్పుడు ఒక్కటే అనుకున్నా. కాంగ్రెస్ భావజాల సుడిగుండం నుంచి దేశాన్ని కాపాడాలని కంకణం కట్టుకున్నా. ఏ రాష్ట్రంలోనైనా మా మార్గదర్శకం ఓట్లు, సీట్లుకాదు. దేశమే ముఖ్యం అనే నినాదంతో ముందుకెళ్తున్నాం. ఎవరి గురించి అయితే ఎవరూ పట్టించుకోలేదో వాళ్లనే మోదీ పట్టించుకుంటాడు. అదే అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రం. అందుకే 2014 నుంచి అభివృద్ధికి కొత్త కేంద్రంగా అరుణాచల్‌ప్రదేశ్‌ను మలిచా. రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలున్నాయి.
డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలుంటే కలిగే డబుల్ ప్రయోజనాలకు అరుణాచల్ ఒక మచ్చుతునక. ఈరోజు ప్రకటించిన పలు విద్యుత్ ప్రాజెక్టులు పూర్తయ్యాక రాష్ట్రం ప్రధాన విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా భాసిల్లుతుంది. రూ. 1,750 కోట్ల వ్యయంతో 80.2 కోట్ల యూనిట్ల వార్షిక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో చేపట్టిన టాటో–1 ప్రాజెక్ట్ పూర్తయితే వేలాది మందికి ఉపాధితోపాటు సరసమైన ధరలో విద్యుత్ అందుబాటులో ఉంటుంది"అని మోదీ అన్నారు. షియో మీ జిల్లాలో యార్జేప్ నదిపై రెండు భారీ జలవిద్యుత్ ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేశారు.

అలిగిన కూటమి పార్టీ
త్రిపురలో మోదీ పాల్గొన్న కార్యక్రమాల్లో కనీసం తమకు ఆహ్వానం అందలేదని త్రిపుర రాష్ట్రంలో కూటమి సర్కార్‌లో భాగస్వామి అయిన 'ది తిప్రా మోథా' పార్టీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ మేరకు పార్టీ టీఎంపీ సీనియర్ ఎమ్మెల్యే రంజిత్ దేవ్‌వర్మ ఒక ప్రకటన విడుదలచేశారు. "త్రిపురేశ్వరీ ఆలయం ప్రాంగణంలో మోదీ చేపట్టిన పునరుద్ధరణ భవనాల ప్రారంత్సవాలు, పూజా కార్యక్రమాల్లో మా టీఎంపీ పార్టీ చీఫ్, రాజవంశీకుడు ప్రద్యోత్ కిశోర్ మాణిక్య దేవ్‌వర్మను ఆహ్వానించలేదు.
కూటమి సర్కార్‌లో సభ్యులై ఉండికూడా పార్టీ ఎమ్మెల్యేలను పిలవలేదు. ఆలయాన్ని కట్టించిన మహారాజ ధన్య మాణిక్య రాజవంశానికే చెందిన రాజమాత విభూ కుమారి దేవికి సైతం ఆహ్వానం అందలేదు" అని దేవ్‌వర్మ అసహనం వ్యక్తంచేశారు. 1949 సెప్టెంబర్‌లో నాటి భారత సర్కార్, రాణి కంచన్ ప్రవదేవీల మధ్య ఒడంబడిక కుదిరే నాటికి ఈ ఆలయం ఈ వంశస్తుల అధీనంలోనే ఉందని దేవ్‌వర్మ గుర్తుచేశారు. మాకూ ఆహ్వానం అందలేదని మరో కూటమి పార్టీ ఇండీజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర ఆగ్రహం వ్యక్తం చేసింది.

స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో మాటామంతీ
అరుణాచల్ రాజధాని ఇటానగర్‌లో ఇందిరాగాంధీ పార్క్‌లో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌నూ మోదీ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి స్వయంసహాయక సంఘాల ప్రతినిధులు, స్థానిక వ్యాపారులతో మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తగ్గిన జీఎస్టీతో మీకు ఎలాంటి ప్రయోజనాలు దక్కనున్నాయో వాళ్లను మోదీ స్వయంగా అడిగి తెల్సుకున్నారు. " స్థానిక వ్యాపార వర్గాలతో నేరుగా సంభాషించడం ద్వారా వాళ్లలో ఉత్సాహాన్ని పెంచడంతోపాటు వ్యాపారాన్ని మరింత అభివృద్ధిచేయాలని వాళ్లను ప్రోత్సహించా. ఇలాంటి చర్యలు క్షేత్రస్థాయి నుంచి వ్యాపారమూలాలను మరింత బలోపేతం చేస్తాయి"అని మోదీ ఆ తర్వాత అన్నారు.
జీఎస్టీ ద్వారా ఒకే దేశం, ఒకే పన్ను భావనను తీసుకొచ్చి పాత పలురకాల పన్నులకు ప్రధాని మోదీ చరమగీతం పాడారని అక్కడి స్థానిక వ్యాపారులు గుర్తుచేసుకున్నారు. జీఎస్టీ తగ్గడంతో నిర్మాణ వ్యయం భారీగా తగ్గనుందని, దీంతో గృహనిర్మాణ ఖర్చులు కలిసొస్తాయని స్థానిక వ్యాపారులు మోదీతో చెప్పారు. ముడిసరుకులు తక్కువ ధరకు లభిస్తాయని, దీంతో స్థానిక ఉత్పత్తుల తయారీ వ్యయం తగ్గనుందని ఆదాయం పెరిగే అవకాశముందని వాళ్లు మోదీతో అన్నారు. వికసిత్ భారత్ సుసాధ్యం కావాలంటే మీరంతా స్వదేశీ వస్తువులనే వినియోగించాలని, స్వదేశీ వస్తువులనే అమ్మాలని వాళ్లకు మోదీ సూచించారు.

త్రిపురేశ్వరీ ఆలయంలో పూజలు
త్రిపురలో పర్యటించిన సందర్భంగా ప్రధాని మోదీ గోమతీ జిల్లాలోని ప్రఖ్యాత త్రిపురేశ్వరీ ఆలయాన్ని సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ తీర్థయాత్ర కాయకల్ప, అభివృద్ధి(ప్రసాద్) పథకంలో భాగంగా రూ. 52 కోట్లతో చేపట్టిన త్రిపురేశ్వరీ ఆలయ మరమ్మతు పనులు పూర్తయిన సందర్భంగా మోదీ గర్భగుడిలో అమ్మవారిని దర్శించుకున్నారు. 'మహారాజా' ధన్య మాణిక్య 1501 సంవత్సరంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. 500 సంవత్సరాల ఘనచరిత గల ఈ ఆలయం 51 శక్తిపీఠాల్లో ఒకటిగా భక్తులు కొలుస్తారు. సోమవారం ఆలయంలో మోదీ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో కొద్దిసేపు కలియతిరిగారు. త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి, ముఖ్యమంత్రి మాణిక్‌సాహా, సీనియర్ ఉన్నతాధికారులు మోదీకి ఆలయ విశిష్టతను వివరించారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఆలయ ప్రత్యేకతను చాటే ఎగ్జిబిషన్‌నూ మోదీ సందర్శించారు. మండే ఎండలోనూ మోదీని చూసేందుకు జనం ఎగబడ్డారు. గత 11 సంవత్సరాల్లో త్రిపురకు మోదీ రావడం ఇది 11వ సారి కావడం విశేషం. '11 ఏళ్లలో మోదీ 11 సార్లు త్రిపురకు వచ్చారు. నవరాత్రి తొలిరోజున భక్తిశ్రద్ధలతో మోదీ సంప్రదాయ ధోతీలో మాతా త్రిపురసుందరిని దర్శించుకున్నారు' అని ఎంపీ బిప్లవ్ కుమార్ వెల్లడించారు. ప్రసాద్ పథకంలో భాగంగా ఆలయ కాంప్లెక్స్‌లో భక్తులు సేదతీరేందుకు పెద్ద హాల్, వేచి ఉండే గది, ధ్యానం హాల్, పూజారి గది, మ్యూజియంలను నిర్మించారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక గది ఏర్పాటుచేశారు. ఒకేసారి రెండు లక్షల మంది భక్తులు సందర్శించినా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా 30,000 చదరపు అడుగుల్లో ఏర్పాట్లు చేశారు. దీపావళి రోజున ఈ ఆలయానికి భక్తుల తాకిడి మరీ విపరీతంగా ఉంటుంది.

మొదటి పేజీ తరువాయి

# ఆర్ఆర్ఆర్ బాధితుల పక్షాన పోరాడతాం

ఈ-కబురు,హైదరాబాద్: రీజినల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) ఎలైన్‌మెంట్ వల్ల నష్టపోయిన బాధితుల పక్షాన భారత రాష్ట్ర సమితి పార్టీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు.
ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌తో నష్టపోయిన నల్గొండ, సూర్యాపేట జిల్లాలతో పాటు గజ్వేల్, సంగారెడ్డి నియోజకవర్గాలకు చెందిన బాధితులు తెలంగాణ భవన్‌లో సోమవారం కేటీఆర్‌ను కలిశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా నేతలు పాల్గొన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ..
"రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ వంటి కాంగ్రెస్ అగ్రనేతలు ఎన్నికల ముందు రీజినల్ రింగ్ రోడ్డుతో ఎవరికీ ఇబ్బంది ఉండదని హామీ ఇచ్చారు. వాటిని నమ్మి రైతులు కాంగ్రెస్‌కు ఓట్లు వేశారు. అయితే అధికారంలోకి వచ్చాక..
ఎలైన్‌మెంట్ మార్చి రైతులకు తీవ్ర నష్టం చేస్తున్నారు. గెలిచిన తర్వాత రైతులను పూర్తిగా మర్చిపోయారు. ఆర్ఆర్ఆర్ బాధితుల అంశాన్ని రాజ్యసభలో భారత రాష్ట్ర సమితి ఎంపీలు లేవనెత్తుతారు. అసెంబ్లీలోనూ ఈ అంశాన్ని ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రైతన్నలు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఉండాలి.
తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు. శాస్త్రీయంగా ఎలైన్‌మెంట్ జరిగే దాకా భారత రాష్ట్ర సమితి పార్టీ రైతులకు అండగా ఉంటుంది. రీజినల్ రింగ్ రోడ్డు బాధితులు తమ డిమాండ్లు సాధించుకోవడానికి ఐకమత్యం ప్రదర్శించాలి. గ్రామగ్రామాన అన్ని పార్టీలను కలుపుకొని.. తీర్మానాలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాలి. ఇలా చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పక దిగివస్తాయి. సమస్య వారి దృష్టికి వెళ్తుంది" అని కేటీఆర్ పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# అక్టోబరులోపు అడ్డంకులు అధిగమించాలి



ఈకబురు, హైదరాబాద్: రాష్ట్రంలోని జాతీయ రహదారుల నిర్మాణంలో తలెత్తుతున్న అడ్డంకులను అక్టోబరులోగా అధిగమించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. రోడ్లకు అవసరమైన భూసేకరణ, పరిహారం పంపిణీలో జాప్యం ఎందుకు జరుగుతోందని కలెక్టర్లను ప్రశ్నించారు. ఈ విషయంలో అలసత్వం చూపే కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లపై వేటు వేస్తామని హెచ్చరించారు. అటవీ అనుమతుల విషయంలో అవసరమైతే కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, భూపేందర్ యాదవ్‌లతో మాట్లాడతానని స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఎన్‌హెచ్‌ఏఐ, మోర్త్ ప్రాజెక్టులపై సంబంధిత కేంద్ర, రాష్ట్ర అధికారులతో సీఎం అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.
జాతీయ ప్రాజెక్టులకు భూసేకరణ, అటవీ అనుమతులు, విద్యుత్ యుటిలిటీ ఛార్జీల సమస్యలు అడ్డంకిగా మారాయని ఎన్‌హెచ్ అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన అప్పటికప్పుడే జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. భూసేకరణ వేగవంతం చేసి రహదారుల పనులు వేగంగా జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. అటవీ అనుమతులపై చర్చ సందర్భంగా 2002 నుంచి 2022 వరకు పలు ప్రాంతాల్లో అటవీ, పర్యావరణ నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని, అటవీ అనుమతులివ్వడం లేదని సీఎం దృష్టికి అటవీశాఖ సౌత్ రీజియన్ ఐజీ త్రినాథ్‌కుమార్ తీసుకెళ్లారు. దీనిపై సీఎం అసహనం వ్యక్తం చేశారు. "అప్పటి ఉల్లంఘనల అంశాలు ఇప్పుడెందుకు? దీనిపై వివరాలను సీఎస్ వెంటనే సమర్పించాలి. అవసరమైనచోట ప్రత్యామ్నాయ భూమిని ఇస్తాం. కేంద్ర మంత్రులతోనూ మాట్లాడతా. వన్యప్రాణులు లేని అటవీ ప్రాంతాల్లోనూ వన్యప్రాణుల చట్టం అమలు చేస్తున్నారు. పీసీసీఎఫ్ చొరవ చూపి అటవీ అనుమతుల ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలి.

ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలను ఒకటిగా చూడాలి
ప్రాంతీయ వలయ రహదారి(ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించిన ప్రతి అంశాన్నీ నివృత్తి చేస్తున్నాం. ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలను ఒక్కటిగానే చూడాలి. వీటి పనులు ఏకకాలంలో జరిగేలా చూడాలి. ఉత్తర భాగానికి ఇచ్చిన జాతీయ రహదారి నంబరునే దక్షిణ భాగానికీ కేటాయించాలి. దక్షిణభాగం ఎలైన్‌మెంట్‌ను వెంటనే ఆమోదించాలి.



సమావేశంలో పాల్గొన్న కేంద్ర ప్రభుత్వ, మోర్త్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు

గ్రీన్‌ఫీల్డ్ రహదారికి వెంటనే అనుమతులివ్వాలి
ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా మచిలీపట్నం వరకు 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి వెంటనే అనుమతులివ్వాలి. రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఈ రహదారిని నిర్మించాలని ఉంది. పీఎం గతిశక్తి లేదా మరో పథకంలోనైనా దీనికి అనుమతులివ్వాలి. ఈ రోడ్డుకు సమాంతరంగా రైలు మార్గం అడుగుతున్నాం. శంషాబాద్ విమానాశ్రయం అమరావతి మధ్య రైలుమార్గం అవసరం. వందేభారత్ సహా ఇతర రైళ్ల రాకపోకలకు లాభసాటిగా ఉంటుంది.

రావిర్యాలమన్ననూర్ ఎలివేటెడ్ కారిడార్‌కు...
హైదరాబాద్‌శ్రీశైలం మార్గంలో రావిర్యాలమన్ననూర్‌కు సంబంధించిన ఎలివేటెడ్ కారిడార్‌కు వెంటనే అనుమతులివ్వాలి. హైదరాబాద్‌మన్నెగూడ రహదారి మార్గంలో మర్రి చెట్ల తొలగింపునకు సంబంధించి ఎన్జీటీలో ఉన్న కేసు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. హైదరాబాద్‌మంచిర్యాలనాగ్‌పుర్ కొత్త రహదారికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలను అంగీకరించాలి. మంచిర్యాలవరంగల్‌ఖమ్మంవిజయవాడ, జగిత్యాలకరీంనగర్, మహబూబ్‌నగర్‌మరికల్‌దేవసుగూర్ రహదారుల భూసేకరణ, పరిహారానికి సంబంధించి వారంలోగా నివేదిక తయారుచేసి అడ్వొకేట్ జనరల్‌తో మాట్లాడాలి. వీటికి పరిహారం పంపిణీ విషయంలో ఆలస్యమవుతోంది.. కలెక్టర్లు ఈ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి'' అని సీఎం పేర్కొన్నారు.
తమ కార్యాలయ నిర్మాణానికి హైదరాబాద్‌లో రెండెకరాల స్థలాన్ని కేటాయించాలని సీఎంను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, కె.ఎస్.శ్రీనివాసరాజు, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వినయ్‌కుమార్ రజావత్, ఎన్‌హెచ్‌ఏఐ సభ్యుడు(ప్రాజెక్టు) అనిల్‌చౌదరి, మోర్త్ ప్రాంతీయాధికారి కృష్ణప్రసాద్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారి శివశంకర్, ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, అటవీ పర్యావరణశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీం తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మోర్త్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు మంత్రి కోమటిరెడ్డిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు.
దేశాభివృద్ధి, సమానత్వానికి కృషి చేసిన మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకలను బంజారాహిల్స్ రోడ్ నం.12లోని అగ్రసేన్ కూడలిలో అఖిల భారత వైశ్య ఫెడరేషన్, తెలంగాణ అగర్వాల్ సమాజ్ సోమవారం సంయుక్తంగా నిర్వహించాయి. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మేయర్ విజయలక్ష్మి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే దానం నాగేందర్, అఖిల భారత వైశ్య సమాఖ్య అధ్యక్షుడు గిరీశ్‌సంఘి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దక్కన్ సిమెంట్స్‌లో కార్మికుల ఆందోళన.. ఉద్రిక్తత

ఈకబురు, పాలకవీడు, : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం భవానీపురంలోని దక్కన్ సిమెంట్స్ ఫ్యాక్టరీ వద్ద సోమవారం ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్ కార్మికులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఫ్యాక్టరీ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాలకవీడు ఎస్సై కోటేశ్ సిబ్బందితో వచ్చి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వాగ్వాదం చోటు చేసుకోగా.. కార్మికులు కర్రలు, రాళ్లతో పోలీసులపై దాడికి పాల్పడ్డారు. కర్మాగారం సీజీఎం నాగమల్లేశ్వరరావు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీసీఎల్ మూడో గనిలో ప్రైవేటు ఏజెన్సీ ద్వారా నియమితుడైన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వినోద్(45) ఆదివారం కార్మికుల కాలనీలోని తన గది వద్ద దుస్తులు ఉతికేందుకు వెళ్లి అస్వస్థతకు గురయ్యారు. ఆయన్ను మొదట ఫ్యాక్టరీలోని ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాధిత కుటుంబానికి పరిహారం అందజేయాలని వినోద్‌ను నియమించిన ఏజెన్సీ వారితో తోటి కార్మికులు చర్చలు జరిపారు. అయితే వివిధ రాష్ట్రాలకు చెందిన దాదాపు 250 మంది కార్మికులు ఫ్యాక్టరీ వారు కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ఒక్కసారిగా దాడికి పాల్పడటంతో ఎస్సై కోటేశ్, హోంగార్డు గోపి గాయపడ్డారు. పోలీసు వాహనం అద్దాలు, డీసీఎల్ సెక్యూరిటీ ఆఫీసు అద్దాలు ధ్వంసమయ్యాయి. కోదాడ రూరల్, మునగాల సీఐలు ప్రతాపలింగం, రామకృష్ణారెడ్డి, నేరేడుచర్ల, గరిడేపల్లి, మఠంపల్లి ఎస్సైలు రవీందర్, నరేష్, బాబు సిబ్బందితో వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. విధ్వంస కారకులపై విచారణ చేపట్టారు.



# సింగరేణి కార్మికులకు లాభంలో 34% చెల్లించాలి



ఈ-కబురు,హైదరాబాద్: : ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు, స్వరాష్ట్రం సాధించినప్పటికీ సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహమే చేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సింగరేణి కార్మికులకు ప్రభుత్వం బోనస్ ప్రకటించడంపై ఆయన సోమవారం ఒక ప్రకటనలో స్పందించారు. "దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు తీపి కబురు బదులు చేదు కబురు చెప్పి, తీవ్ర నిరాశలోకి నెట్టారు. మొత్తం లాభం రూ.6,394 కోట్ల నుంచి కాకుండా.. రూ.2,360 కోట్ల నుంచి బోనస్ చెల్లించడం దారుణం. పంచాల్సిన వాటాను తగ్గించి, శాతాలు పెంచి కార్మికులను మోసం చేశారు. గతంలో కేసీఆర్ సర్కారు ఎప్పుడైనా నికర లాభంలో కార్మికులకు వాటా ఇచ్చారు. లాభాల వాటాను 16 శాతం ఉన్న దాన్ని 32 శాతం వరకు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వచ్చిన లాభంలో మూడో వంతు పక్కన పెట్టి.. మిగిలిన ఒక వంతులో వాటా ఇవ్వడం దుర్మార్గం. నికర లాభంలో 34 శాతం బోనస్‌గా చెల్లించాలి. సింగరేణి కార్మికులకు అన్యాయం జరిగితే.. వారి పక్షాన పోరాడుతాం" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# చర్చోపచర్చలు!

**మెట్రో విస్తరణపై నిర్వహణ సంస్థకు వివిధ ప్రత్యామ్నాయాలు చూపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**

**లేదంటే తగిన రీతిలో ముందుకెళతామంటూ సంకేతాలు**

ఈకబురు,హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణను వీలైనంత త్వరగా చేపట్టాలన్న పట్టుదలతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం... నిర్వహణ సంస్థ ఎల్అండ్‌టీతో చర్చలను ముమ్మరం చేసింది. విస్తరణ త్వరగా పూర్తి చేస్తే... మెట్రోరైలు మొదటి దశలో నష్టాలను చవిచూస్తున్న ఎల్అండ్‌టీకి ప్రయోజనకరంగా ఉంటుందని, కలిసి రాకుంటే తగిన రీతిలో ముందుకు వెళ్తామని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు... ఎల్అండ్‌టీతో పలుదఫాలుగా చర్చించారు. తాజాగా మూడు రోజుల క్రితం చర్చించి జాప్యం చేయకుండా... ఏదో ఒక నిర్ణయానికి రావాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఒకానొక సమయంలో బ్యాంకుల్లో ఉన్న రుణాలు రూ.13 వేల

మొదటి పేజీ తరువాయి

కోట్లు, నిర్మాణానికి అయిన ఖర్చు రూ.7 వేల కోట్లను కలిపి ఇస్తే పూర్తిగా తప్పుకొంటామని ఎల్అండ్‌టీ ప్రతిపాదించగా, రుణాల బాధ్యత వరకు పూర్తిగా తీసుకొంటామని, భారత రాష్ట్ర సమితి హయాంలో వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద పెండింగ్‌లో పెట్టిన బకాయిల వరకు ఇస్తామని ప్రభుత్వం వైపు నుంచి చెప్పినట్లు సమాచారం.

కేంద్ర ప్రభుత్వం సూచనలతో...

మొదటి దశ నిర్వహణతోపాటు రెండో దశలోనూ కొంతభాగాన్ని ఎల్అండ్‌టీ చేపట్టాలన్న ఆలోచనతోనే ప్రభుత్వం ఉందని, పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలను పరిగణనలోకి తీసుకొని మూడేళ్లలో రెండో దశను పూర్తి చేయాల్సి ఉందని, దీనికి సహకరించాలని సీఎస్ సూచించినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం మెట్రో రెండోదశ ప్రతిపాదనను కేంద్రానికి పంపిన విషయం తెలిసిందే. సగం ఒకరు నిర్వహిస్తుంటే, మిగిలిన సగం వేరే వారు నిర్మించి, ఎలా నిర్వహిస్తారు... విక్రయించిన ప్రతి టికెట్‌లో ఎవరి వాటా ఎంత తదితర ప్రశ్నలను కేంద్రం లేవనెత్తినట్లు తెలిసింది. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం, ఎల్అండ్‌టీ కలిసి ఒక ఒప్పందం చేసుకొని రావాలని సూచించింది. దీంతో ఈ అంశాన్ని కొలిక్కి తెచ్చేందుకు ప్రభుత్వం కొన్ని రోజులుగా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. మెట్రో మార్గాన్ని... రాయదుర్గం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నాలెడ్జ్‌సిటీ మీదుగా నియోపోలిస్ వరకు... మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్, రామచంద్రాపురం వరకు... ఎల్.బి.నగర్ నుంచి హయత్‌నగర్ వరకు... గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు... నాగోల్ నుంచి ఎల్.బి.నగర్, ఒవైసీ ఆసుపత్రి మీదుగా శంషాబాద్ వరకు... ఇలా పూర్తిస్థాయిలో విస్తరిస్తేనే ప్రయోజనం ఉంటుందని తెలంగాణ ప్రభుత్వం ఆలోచిస్తోంది. ప్రస్తుతం ఉన్న మెట్రోరైలును పరిగణనలోకి తీసుకొంటే ప్రజలు చివరి పాయింట్లో దిగి ముఖ్యమైన ప్రాంతాలకు ఆటోలు, ఇతర వాహనాల్లో వెళ్లాల్సి వస్తోందని రెండోదశ పూర్తి చేస్తేనే పూర్తిస్థాయిలో ప్రయోజనం ఉంటుందని భావిస్తోంది.

ప్రయాణికుల సంఖ్య 12 లక్షలకు చేరితే...

ప్రస్తుత మెట్రోతో తమకు ఏడాదికి రూ.600 కోట్ల నష్టం వస్తోందని నిర్వహణ సంస్థ ఎల్అండ్‌టీ పేర్కొన్నట్లు ప్రభుత్వవర్గాలు తెలిపాయి. అయితే, ప్రతి రోజూ ఎంత వస్తుందో ప్రభుత్వం వద్ద లెక్క ఉందని, బ్యాంకుల్లో ఉన్న రుణం రూ.13 వేల కోట్లు ఇస్తామని సర్కారు చెప్పినట్లు తెలిసింది. గత ప్రభుత్వం వయబులిటీ గ్యాప్ ఫండ్ కింద రూ.3 వేల కోట్లు ఇవ్వడానికి అంగీకరించి రూ.900 కోట్లు ఇచ్చిందని, ఇందులో మిగిలిన మొత్తం కూడా ఇస్తామని పేర్కొన్నట్లు సమాచారం. అయితే, తాము మెట్రోను అమ్మబోం... సంతకమూ చేయబోమంటూ ఎల్అండ్‌టీ సంస్థ పేర్కొన్నట్లు ప్రభుత్వవర్గాలు తెలిపాయి. ప్రస్తుతం నిత్యం 5లక్షల మంది వరకు ప్రయాణిస్తుండగా, విస్తరణ తర్వాత ఆ సంఖ్య 1213 లక్షలకు చేరుతుందని, అప్పుడు మొదటి దశ మెట్రోకు చాలా ఉపయోగమంటూ వివిధ రకాల లెక్కలను సంస్థ ముందు పెట్టినా అంగీకరించలేదని తెలిసింది. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో 20% కూడా ఇంకా వినియోగంలోకి రాలేదని, మొదటి దశలో 75 కి.మీ. నిర్మించేలా ఒప్పందం చేసుకొని 69 కి.మీ. నిర్మించారని, మిగిలిన ఆరు కి.మీ.లకు అయ్యే ఖర్చు మొత్తాన్ని రికవరీ చేస్తామని కూడా చర్చల్లో ప్రభుత్వ అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం. మొదటి దశ మెట్రోకు 9% వడ్డీతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొన్నారని, ప్రస్తుతం 4% వడ్డీతోనే తీసుకోవడానికి అవకాశం ఉన్నందున మూడేళ్లలోనే లాభాల్లోకి వస్తుందని ఒక సీనియర్ అధికారి అభిప్రాయపడ్డారు. ఎల్అండ్‌టీతో ఒక అంగీకారానికి వచ్చి ముందుకు వెళ్తే తప్ప కేంద్రం సానుకూలంగా స్పందించే అవకాశం లేకపోవడంతో వీలైనంత త్వరగా పరిష్కారం కనుగొనేందుకు ప్రభుత్వం చర్చలను ముమ్మరం చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.



# యుద్ధాలపైనే ప్రధాన చర్చ



ఈకబురు: ఐక్యరాజ్యసమితి: గాజా, ఉక్రెయిన్ యుద్ధాలతో పాటు.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలతో ప్రపంచం అతలాకుతలమవుతున్న నేపథ్యంలో 150కుపైగా దేశాల అధినేతలు మంగళవారం నుంచి న్యూయార్క్‌లో జరగనున్న ఐక్యరాజ్యసమితి 80వ వార్షిక సర్వ ప్రతినిధుల సభ సమావేశంలో పాల్గొననున్నారు. యుద్ధాలతో పాటు.. పర్యావరణ అంశాలు, టెక్నాలజీ, ఐరాస సంస్కరణలు ఇతర కీలక అంశాలపై ప్రపంచ నేతలు చర్చించనున్నారు. ఈ సమావేశానికి భారత్ తరఫున విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ హాజరుకానున్నారు. మొత్తం 193 సభ్య దేశాలు ఈ వార్షిక సమావేశంలో వివిధ అంశాలపై తమ గళాన్ని వినిపించనున్నాయి. ఇజ్రాయెల్‌హమాస్ యుద్ధంతో గాజాలో నెలకొన్న మానవతా సంక్షోభంపై ఇటీవల సర్వప్రతినిధుల సభ ఆమోదించిన 'న్యూయార్క్ డిక్లరేషన్'పైనా చర్చ జరిగే అవకాశం ఉంది. పాలస్తీనాను స్వతంత్ర దేశంగా ఆదివారం బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా గుర్తించిన నేపథ్యంలో ఈ సమావేశాల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ కూడా అధికారికంగా గుర్తించే అవకాశం ఉంది. పాలస్తీనా ఎప్పటికీ దేశం కాబోదని వ్యాఖ్యానించిన నెతన్యాహు ఇజ్రాయెల్ ప్రధానిగా తన దేశం తరఫున సభలో వాదనలు వినిపించనున్నారు. పాలస్తీనా అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్‌కు అమెరికా వీసా నిరాకరించిన నేపథ్యంలో ముందే రికార్డుచేసిన వీడియో సందేశంలో ఆయన వర్చువల్‌గా ప్రసంగిస్తారు.

# మరో ఏడాది అణ్వస్త్ర పరిమితికి కట్టుబడతాం: పుతిన్



ఈ-కబురు,మాస్కో: అమెరికాతో కుదుర్చుకున్న అణ్వాయుధాల పరిమితికి మరో ఏడాదిపాటు కట్టుబడి ఉంటామని రష్యా ప్రకటించింది. 2026 ఫిబ్రవరి 5తో ప్రస్తుత ఒప్పందం ముగియబోతున్న నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సోమవారం ఈ ప్రకటన చేశారు. దీనిని అమెరికా కూడా పాటించాలని కోరారు. 2010లో కుదిరిన 'న్యూ స్టార్ట్' ఒప్పందాన్ని ముగించేస్తే విపరిణామాలకు దారితీసి అణ్వాయుధాలకు ఆజ్యం పోసే అవకాశం ఉంటుందని టెలివిజన్ ప్రసంగంలో పేర్కొన్నారు. "వ్యూహాత్మక ఆయుధాల పోటీపరంగా కవ్వింపులకు అడ్డుకట్టవేసి, ఆమోదనీయ స్థాయిలో సంయమనాన్ని పాటించాల్సి ఉంది. దానికోసం మునుపటి ఒప్పందంపై యథాతథస్థితి కొనసాగడమే సబబు అని భావిస్తున్నాం. ఆ తర్వాత పరిస్థితిని సమీక్షించి.. స్వచ్ఛందంగా పాటిస్తున్న స్వీయ నియంత్రణపై ఒక నిర్ణయానికి వస్తాం. అమెరికా కూడా ఇలాగే ఆచరించి, సంయమనానికి భంగం కలిగించని రీతిలో చర్యలు చేపడుతుందని విశ్వసిస్తున్నాం. అమెరికా కార్యకలాపాలను నిశితంగా పరిశీలించాల్సిందిగా మా సంస్థల్ని ఆదేశించాం. ముఖ్యంగా వ్యూహాత్మక ఆయుధాలపై నిఘా ఉంటుంది. అమెరికా క్షిపణి రక్షణ వ్యవస్థలు, అంతరిక్ష కార్యకలాపాలకు సన్నద్ధత సహా అన్నింటిపై కన్నువేసి ఉంచుతాం. అస్థిరపరిచేలా ఎవరైనా చర్యలు చేపడితే దానికి తగ్గ రీతిలో మేం స్పందిస్తాం. ఒప్పందాన్ని మేం గౌరవించడం వల్ల అమెరికాతో వ్యూహాత్మక చర్చలకు సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. ద్వైపాక్షిక బంధాలు సాధారణీకరించేందుకు ఇతర చర్యలూ చేపడతాం" అని పుతిన్ చెప్పారు. అమెరికా, రష్యాల వద్ద గరిష్ఠంగా 1,550 అణు వార్‌హెడ్లు, 700 క్షిపణులు/ బాంబర్లు మాత్రమే ఉండాలని న్యూ స్టార్ట్ ఒప్పందం చెబుతోంది. అది ముగియవస్తుండటం, దాని కొనసాగింపుపై చర్చలు లేకపోవడంతో ఆయుధ నియంత్రణను కోరుతున్నవారిలో కలవరం వ్యక్తమవుతోంది.

**రష్యా, ఉక్రెయిన్‌ల డ్రోన్ల దాడి**

కీవ్: పౌర ప్రాంతాల్లో ప్రాణాంతక డ్రోన్లతో రష్యా, ఉక్రెయిన్ పరస్పరం డ్రోన్లదాడికి పాల్పడ్డాయి. ఒకదానిపై ఒకటి ఆరోపణలు చేసుకున్నాయి. ఐరాస సర్వ ప్రతినిధి సభలో ముమ్మర దౌత్య యత్నాలకు రెండు దేశాలూ సిద్ధమవుతున్నవేళ ఈ దాడులు చోటుచేసుకున్నాయి.

# ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి




**ఇటలీ పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం**

ఈకబురు,హైదరాబాద్: దేశంలోనే అతిపెద్ద ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా రూపాంతరం చెందుతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఇటలీ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. సోమవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆ దేశానికి చెందిన ప్రముఖ ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ప్రతినిధులు మంత్రితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కాంపోనెంట్ తయారీ, సప్లై చైన్, మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎమ్మార్వో), ఏవియానిక్స్, రాడార్ అండ్ సెన్సర్ సిస్టమ్స్, న్యూస్పేస్ అండ్ చిన్న ఉపగ్రహాలు, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ కంపోజిట్స్ తదితర రంగాలకు సంబంధించిన తయారీలో.. తెలంగాణలో ఉన్న అవకాశాలు, అనుకూలతలను మంత్రి శ్రీధర్‌బాబు వారికి వివరించారు. "రాష్ట్రంలో ప్రత్యేక ఏరోస్పేస్ పార్కులు, సెజ్‌లు, భారీ ఎంఎస్ఎంఈ నెట్‌వర్క్, శక్తిమంతమైన ఆర్ అండ్ డీ, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, అత్యుత్తమ ప్రతిభగల మానవ వనరులు, సుస్థిర ప్రభుత్వం, సమర్థమైన నాయకత్వం, పారిశ్రామిక ప్రోత్సాహక విధానాలతో కూడిన పటిష్ఠమైన ఎకోసిస్టమ్ అందుబాటులో ఉంది. విమానాలు, హెలికాప్టర్ల ఇంజిన్ల నిర్వహణలో ఇటలీకి ఉన్న నైపుణ్యం ఇక్కడి డిఫెన్స్, ప్రైవేట్ రంగాలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఏవియానిక్స్, 'రాడార్ అండ్ సెన్సర్ సిస్టమ్స్'లో ఇటలీ కంపెనీలకు అపార అనుభవం ఉంది. ఈ రంగానికి చెందిన వస్తువులను ఇక్కడ ఉత్పత్తి చేస్తే దేశ రక్షణ రంగం అవసరాలు తీరుతాయి. విదేశాలకూ ఎగుమతి చేయొచ్చు" అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ సంజయ్‌కుమార్.. డిఫెన్స్, ఏరోస్పేస్ డైరెక్టర్ ప్రవీణ్ పీఏ, కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇటలీ ఇన్ బెంగళూరు జియాన్లొమెనికో మిలానో, ట్రేడ్ కమిషనర్ అంటోనియెట్టా బక్కానారి, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 'ఆపరేషన్ సిందూర్ 2' మీ తీరుపై ఆధారపడి ఉంటుంది

పాక్‌కు రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరిక

ఈకబురు దిల్లీ: ఆపరేషన్ సిందూర్ పార్ట్2 అనేది పాకిస్థాన్ తీరుపై ఆధారపడి ఉంటుందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ఉగ్రవాదులకు మద్దతిస్తున్న పాకిస్థాన్‌కు సరిహద్దుల్లోనే కాకుండా.. వారి సొంతగడ్డపైనా గట్టిగా బుద్ధి చెప్పామన్నారు. మొరాకో పర్యటనలో ఉన్న ఆయన అక్కడి ప్రవాస భారతీయులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్' విజయాలను పంచుకున్నారు. "ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి మతం అడిగి మరీ మన పౌరులను చంపేశారు. మేం మతం చూసి వారిని (ఉగ్రవాదులను) మట్టుబెట్టలేదు. వారు చేసిన పనులు చూసి చంపేశాం. పహల్గాం ఘటన తర్వాత జరిగిన సమావేశంలో త్రివిధ దళాల అధిపతులను నేను ఒకే ప్రశ్న అడిగాను. ఒకవేళ ప్రభుత్వం ఆమోదిస్తే ఆపరేషన్‌కు మీరు సిద్ధమా? అని ప్రశ్నించాను. వారు నిమిషం ఆలస్యం చేయకుండా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. దీంతో మేం ప్రధాని మోదీని కలిస్తే.. ఆయన సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు. ఆ తర్వాత ఏం జరిగిందో ప్రపంచమంతా చూసింది. కేవలం సరిహద్దుల్లోనే కాదు దాయాది భూభాగంలో 100 కి.మీ లోపలికి వెళ్లి మరీ ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేశాం. పాకిస్థాన్ అభ్యర్థించడం వల్లే కాల్పుల విరమణకు అంగీకరించాం. ఇక, ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తుతానికి నిలిపివేశాం. అది ఎప్పుడైనా మళ్లీ మొదలవ్వొచ్చు. వారు ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తే మేం తగిన విధంగా బుద్ధి చెబుతాం" అని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు.

# సమ్మక్క సాగర్‌కు ఛత్తీస్‌గఢ్ సై



బ్యారేజీ వెనుక జలాల కారణంగా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్ జిల్లాలోని భూపాలపట్నం తహసీల్ పరిధిలో 54.03 హెక్టార్ల నదీతీర ప్రాంతం, 19.41 హెక్టార్ల పలు రకాల భూములు ముంపునకు గురవుతాయని ఉత్తమ్ వివరించారు. ముంపుపై ఛత్తీస్‌గఢ్ ఆందోళనను పరిగణనలోకి తీసుకుని... పునరావాస చర్యలపై ప్రతిపాదనలతో తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చిందని తెలిపారు. ఐఐటీ ఖరగ్‌పుర్ అధ్యయనం చేసి నివేదిక ఇచ్చిందని... దాని ఆధారంగా పునరావాస చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ముంపుతో నష్టపోతున్న భూ యజమానులకు, ఇతర భూములకు పరిహారం చెల్లిస్తామని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ చట్టాల ప్రకారం పరిహారం అందజేస్తామని, ఎన్వోసీ జారీ చేసే సమయానికి చెల్లింపులు పూర్తి చేస్తామని వివరించారు. దీనిపై స్పందించిన విష్ణుదేవ్.. ఈ అంశాన్ని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని, త్వరలో అధికారిక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తెలంగాణలో సాగునీటి సమస్యలను తీర్చేందుకు బ్యారేజీ ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సుదీర్ఘకాల సమస్యకు పరిష్కారం: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఛత్తీస్‌గఢ్ సీఎంతో భేటీ అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "మా ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించినందుకు ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్‌కు ధన్యవాదాలు. సుదీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కారం దిశగా ఇది గొప్ప అడుగు. ఆ రాష్ట్రంలో భూసేకరణ, పరిహారం, పునరావాస బాధ్యతలను పూర్తిగా తీసుకుంటామని భరోసా కల్పిస్తూ ఓ పత్రం అందజేశాం. ప్రాజెక్టుకు కేంద్ర జలసంఘం నుంచి తుది ఆమోదం లభించాలంటే ఛత్తీస్‌గఢ్ ఎన్వోసీ తప్పనిసరి. తెలంగాణలోని బీడు భూములు, ఫ్లోరైడ్ ప్రభావిత జిల్లాలైన నల్గొండ, వరంగల్‌లలో సాగు, తాగునీటి అవసరాలు తీర్చడానికి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాం. శ్రీరామసాగర్ రెండో దశ కింద 3.91 లక్షల ఎకరాల ఆయకట్టుకు దీని ద్వారా నీళ్లందుతాయి. రామప్పపాకాల లింక్ కాలువ కింద 26 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, జనగామ, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు సాగునీటి భరోసా లభిస్తుంది. ఈ ప్రాజెక్టు కింద బ్యారేజీతో పాటు మూడు పంపుహౌస్‌లు, 90 కిలోమీటర్ల సొరంగాలు, కాలువలు కూడా ఉన్నాయి" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి వెంట నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఈఎన్‌సీ అంజద్ హుస్సేన్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, ఓఎస్డీ భీంప్రసాద్, సీఈ విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.

# పండుగల ముందు పసిడి పరుగు



ఒకే రోజు రూ.2,200 పెరుగుదల
ఢిల్లీలో కొత్త గరిష్ఠం 1,16,200

న్యూఢిల్లీ: పండుగల ముందు పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. సోమవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత పసిడి 10 గ్రాములకు ఏకంగా రూ.2,200 పెరిగి మరో కొత్త జీవితకాల గరిష్ట స్థాయి రూ.1,16,200కి చేరుకుంది. వెండి సైతం రూ.4,380 ర్యాలీ చేసి కిలోకి రూ.1,36,380 స్థాయిని (కొత్త ఆల్‌టైమ్ గరిష్ఠం) తాకింది. 'అంతర్జాతీయ మార్కెట్లలో ఉన్న బుల్లిష్ ధోరణికి అనుగుణంగా దేశీయంగానూ బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిల్లో ట్రేడయ్యాయి.

యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది చివరి నాటికి మరో రెండు రేట్ల కోతలు ఉంటాయంటూ సంకేతం ఇవ్వడం డాలర్, ట్రెజరీ ఈల్డ్స్ బలపడటాన్ని అడ్డుకుంది. ఇది పసిడి, వెండి ధరలకు మద్దతిచ్చింది' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.

అంతర్జాతీయంగా చూస్తే బంగారం ధర 50 డాలర్లకు పైగా పెరిగి 3,760 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యింది. ఈ ఏడాది ఇప్పటి దాకా దేశీ మార్కెట్లో పసిడి ధరలు 47%, వెండి ధరలు 52% పెరగడం గమనార్హం.

**అక్టోబర్ 21న మూరత్ ట్రేడింగ్**

ముంబై: దీపావళి సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు అక్టోబర్ 21న గంట పాటు ప్రత్యేక 'మూరత్ ట్రేడింగ్' నిర్వహించనున్నాయి. మధ్యాహ్నం 1.45 గంటలకు మొదలై 2.45 గంటలకు ట్రేడింగ్ ముగుస్తుందని ఎన్ఎస్ఈ, బీఎస్ఈ తెలిపాయి. ఈ దీపావళి నుంచి సంవత్ 2082 ఆరంభం కానుంది. ఈ పర్వదినం రోజు ట్రేడింగ్ చేస్తే.. వచ్చే దీపావళి వరకు లాభాలు వరిస్తాయనే నమ్మకంతో చాలా మంది మూరత్ ట్రేడింగ్‌లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతుంటారు. గతేడాది(2024) ప్రత్యేక మూరత్ ట్రేడింగ్ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహించాయి.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



సోమవారం ఉదయం స్వల్ప నష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 466.26 పాయింట్లు లేదా 0.56 శాతం నష్టంతో.. 82,159.97 వద్ద, నిఫ్టీ 125.50 పాయింట్లు లేదా 0.50 శాతం నష్టంతో.. 25,201.55 వద్ద నిలిచాయి.

ఎమ్కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, అదానీ పవర్, అదానీ టోటల్ గ్యాస్, శ్రీ పుష్కర్ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్, కెమ్కాన్ స్పెషాలిటీ కెమికల్స్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. సందూర్ మాంగనీస్ అండ్ ఐరన్ ఓరెస్, కెరీర్ పాయింట్ ఎడ్యుటెక్ లిమిటెడ్, ఇన్నోవేటివ్స్ టెక్నాలజీస్, డీఆర్సీ సిస్టమ్స్ ఇండియా, క్రిజాక్ లిమిటెడ్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.

# అరడజను ప్రభుత్వ కంపెనీల్లో మైనార్టీ వాటాల విక్రయం!



చిన్న మదుపర్లకు విలువ సృష్టించేందుకు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్), తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)ల ద్వారా అరడజను ప్రభుత్వ కంపెనీల్లో మైనార్టీ వాటాలు విక్రయించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు దీపమ్ కార్యదర్శి అరుణీష్ చావ్లా వెల్లడించారు. ఏయే కంపెనీల్లో వాటాలు విక్రయించబోతున్నారో తెలుపలేదు. యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రతో పాటు 5 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మైనార్టీ వాటాలను విక్రయించే అవకాశం ఉందని తెలుస్తోంది. కనీస ప్రజా వాటా నిబంధన చేరుకునేందుకు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ)లో కూడా మళ్లీ పెట్టుబడులు ఉపసంహరించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వ రంగంలోని సహజ వనరుల విభాగంలో ఉన్న కంపెనీ ఐపీఓకు వస్తుందని చావ్లా సూత్రప్రాయంగా వెల్లడించారు. ఓఎన్‌జీసీ, ఎన్‌హెచ్‌పీసీగ్రీన్ ఎనర్జీ యూనిట్లు అయిన ఓఎన్‌జీసీ గ్రీన్ ఎనర్జీ, ఎన్‌హెచ్‌పీసీ రెన్యూవబుల్ ఎనర్జీ ఐపీఓకు వచ్చేందుకు చూస్తున్నాయని సమాచారం.

# మన మార్కెట్లకు బలం దేశీయ పెట్టుబడులే



**హెచ్చుతగ్గులు దీర్ఘకాలిక వృద్ధిని ఆపలేవు**

**అమెరికాతో వాణిజ్య ఒప్పందం అవసరమే**

**ఎడెల్‌వైజ్ మ్యూచువల్ ఫండ్ ఎండీ, సీఈఓ రాధికా గుప్తా**

'సంస్కరణలు వేగవంతమైనందున, మన ఆర్థిక వ్యవస్థ కీలక మలుపు దశలో ఉంది. ప్రజల చేతిలో మిగులు మొత్తం పెరుగుతోంది. కొన్నాళ్లు కొనుగోళ్లకు ఈ నిధులను వినియోగించినా, తర్వాత పెట్టుబడుల వైపు ప్రజలు దృష్టి సారిస్తారు. ఈ రెండూ మార్కెట్‌కు లాభం కలిగిస్తాయి. తాత్కాలిక మార్కెట్ హెచ్చుతగ్గులు, దీర్ఘకాలిక వృద్ధిని ప్రభావితం చేయలేవు' అని ఎడెల్‌వైజ్ మ్యూచువల్ ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ రాధికా గుప్తా తెలిపారు. మార్కెట్ల స్థితిపై ఈనాడు ఇంటర్వ్యూలో ఆమె ఏమన్నారంటే..

**మన మార్కెట్ల నుంచి నిధులను విదేశీయులు వేరే మార్కెట్లకు తరలిస్తున్నారు కదా ?**

అయిదేళ్లలో వృద్ధి, ఆదాయాల పరంగా చూస్తే దేశీయ ఈక్విటీలు ఖరీదుగా ఏమీ లేవు. విదేశీ పెట్టుబడిదారుల విక్రయాలకు పలు కారణాలు ఉంటాయి. తమ దేశాల్లో వడ్డీ రేట్లు పెరిగినప్పుడు, వర్ధమాన దేశాల మార్కెట్లను వారు పట్టించుకోరు. చైనా మార్కెట్లు వారికి చౌకగా కనిపిస్తున్నాయి. చాలా ఏళ్ల క్రితం పెట్టిన పెట్టుబడిపై అధిక లాభాలు వస్తున్నందునే, ఇక్కడ ఉపసంహరిస్తున్నారు.

**మన ఆర్థిక వ్యవస్థ ఎలా ఉంది? అమెరికా సుంకాల ప్రభావం ఏమిటి ?**

కొవిడ్ పరిణామాల తర్వాత 2024 వరకు మన ఆర్థిక వ్యవస్థ, స్టాక్ మార్కెట్ ప్రశాంతంగానే ఉన్నాయి. ఏడాది కాలంగా అస్థిరత ఉన్నా, ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే, మన మార్కెట్ మంచి పనితీరు చూపిస్తోంది. ఆదాయపు పన్ను మినహాయింపులు, జీఎస్‌టీ రేట్ల కోత వంటివి గిరాకీ పెంచుతాయి. అమెరికా సుంకాలు, హెచ్1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడం అనిశ్చితి సృష్టిస్తోంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరే వీలుంది. ఫార్మా స్థిరంగా ఉన్నా, ఐటీలాంటి కీలక ఎగుమతి రంగాలు ఇబ్బందికి గురవుతున్నాయి.

**సిప్ ద్వారా వస్తున్న మొత్తం తగ్గడానికి కారణమేంటి ?**

కేవలం 12 నెలల సమాచారాన్ని చూడటం సరికాదు. క్రమానుగత పెట్టుబడి విధాన (సిప్) పెట్టుబడులను దీర్ఘకాలిక దృష్టితో చూడాలి. 2017లో సిప్ ద్వారా మార్కెట్లోకి నెలకు రూ.4,0005,000 కోట్లు వచ్చేవి. ఇప్పుడు దాదాపు రూ.29,000 కోట్లు వస్తున్నాయి. మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులపై ప్రజలకు నమ్మకం పెరిగింది. భవిష్యత్తులోనూ కొనసాగుతుంది.

**చిన్న మదుపరులకు మీ సలహా ఏమిటి ?**

రిటెయిల్ మదుపరులు 20 ఏళ్ల రాబడులను చూసి, ఫండ్లను ఎంచుకోవడం సరికాదు. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ల వంటివి వీరికి అనుకూలం. పోర్ట్‌ఫోలియోలో 80% విస్తృత రంగాల్లో, మిగతా 20% మిడ్ క్యాప్, బ్యాలెన్స్‌డ్, థీమాటిక్ ఫండ్లలో ఉండేలా చూసుకోవాలి. మంచి ఆర్థిక సలహాదారుడిని సంప్రదించి, పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవాలి.

**ఎస్ఐఎఫ్ (స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్) ఎవరికి అనుకూలం ?**

ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఏఐఎఫ్), పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ (పీఎంఎస్)లకు ఎస్ఐఎఫ్ ప్రత్యామ్నాయంగా చెప్పొచ్చు. ఇందులో 7 రకాలున్నాయి. కనీసం రూ.10లక్షల పెట్టుబడితో ఇందులో మదుపు చేయొచ్చు. ఇవి కొత్త వారికి మాత్రం కాదు. మేమూ ఈ విభాగంలో ఒక కొత్త ఫండ్ తీసుకొస్తున్నాం.

**ప్రజల పెట్టుబడి తీరు ఎలా మారుతోంది ?**

ఒకప్పుడు స్థిరాస్తి, బంగారంలాంటి వాటికి అధిక ప్రాధాన్యం ఉండేది. ప్రస్తుతం ఆర్థిక పెట్టుబడుల వైపు ఎక్కువగా చూస్తున్నారు. ఒక దేశం అభివృద్ధి చెందుతోంది అన్నదానికి ఇది నిదర్శనం. పన్ను పరంగానూ ఈక్విటీలకు మించి ప్రయోజనం ఇచ్చేవి లేవు.

# 1.4 కోట్ల ఆధార్ నంబర్లు డీయాక్టివేట్..





యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (UIDAI) దేశవ్యాప్తంగా 1.4 కోట్లకు పైగా ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసింది. ఇవన్నీ చనిపోయినవారికి సంబంధించిన ఆధార్ నంబర్లు. గుర్తింపు మోసాన్ని నిరోధించడానికి, ప్రభుత్వ ప్రయోజనాలు సరైన చేతుల్లోకి వెళ్లేలా చూడటానికి గత ఏడాది ప్రారంభించిన క్లీన్ అప్ డ్రైవ్ కింద ఈ ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసింది.

సంక్షేమ పథకాల విశ్వసనీయతను కాపాడటానికి, దుర్వినియోగాన్ని నివారించడానికి మృతుల ఆధార్ నంబర్లను (Aadhaar) డీయాక్టివేట్ చేయడం చాలా అవసరమని యూఐడీఏఐ సీఈవో భువనేష్ కుమార్ అన్నారు. నకిలీ క్లెయిమ్‌లు లేదా గుర్తింపు మోసం ద్వారా ప్రభుత్వ నిధులు స్వాహా కాకుండా ఇది నిర్ధారిస్తుందన్నారు. డిసెంబర్ నాటికి 2 కోట్ల ఆధార్ నంబర్లు

ఆధార్ క్లీనప్ డ్రైవ్‌ను 2024 మధ్యలో ప్రారంభించారు. ఇది నిరంతర ప్రక్రియ. వచ్చే డిసెంబర్ నాటికి 2 కోట్ల ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేయాలని యూఐడీఏఐ లక్ష్యంగా పెట్టుకుందని మరో సీనియర్ అధికారి తెలిపారు. ఆధార్ ప్రక్షాళన కార్యక్రమం కీలకమైనప్పటికీ, సవాళ్లతో నిండి ఉందని, మరణ నమోదుకు ఆధార్ తప్పనిసరి కాకపోవడం అతిపెద్ద అడ్డంకులలో ఒకటి ఆ అధికారి పేర్కొన్నారు.

మరణాల డేటాను యూఐడీఏఐ పలు మార్గాల ద్వారా సంగ్రహిస్తోంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్జీఐ) ద్వారా సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ఎస్) రికార్డులను వినియోగించుకుంటోంది. కర్ణాటక, ఢిల్లీ, తమిళనాడు, కేరళ, పంజాబ్, పుదుచ్చేరి, గోవా, రాజస్థాన్, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల నుంచి స్వతంత్రంగానూ డేటాను సేకరిస్తోంది. ఆధార్ డేటాను అప్డేట్ చేయడానికి బ్యాంకులు, బీమా కంపెనీలు, పెన్షన్ ఫండ్స్, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ అధికారులతో కలిసి పనిచేస్తోంది.

# బాంబే వస్తున్నా.. తలలు జాగ్రత్త



ఓజాస్ గంభీరగా వెండితెరపై పవన్ కల్యాణ్ చేయనున్న యాక్షన్ హంగామా కోసం సినీప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ 'ఓజీ' చిత్రాన్ని సుజీత్ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ప్రియాంక మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ, శ్రియా రెడ్డి, ప్రకాశ్ రాజ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు."బాంబేలో గ్యాంగ్ వార్స్ మళ్లీ మొదలయ్యాయి. కానీ, ఈసారి గన్స్ అన్నీ సత్య దాదా వైపు తిరిగాయి" అంటూ ఓ వ్యక్తి చెప్పే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం యాక్షన్ కోణంలో ఆసక్తికరంగా సాగింది. "బాంబే వస్తున్నా.. తలలు జాగ్రత్త" అంటూ ఓజాస్ గంభీరగా పవన్ పరిచయమైన తీరు.. స్టైలిష్ యాక్షన్‌తో తను చేసిన విధ్వంసం ఆకర్షణగా నిలిచాయి. మొత్తంగా ఈ ట్రైలర్‌ను బట్టి.. ఇది అజ్ఞాతవాసం నుంచి తిరిగొచ్చిన ఓ గ్యాంగ్‌స్టర్ కథగా ఉండనున్నట్లు అర్థమవుతోంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: రవి కె చంద్రన్, మనోజ్ పరమహంస.

**అన్నయ్యకి రిటైర్మెంట్ లేదు**

తన సోదరుడు, నటుడు చిరంజీవి పుట్టుకతోనే యోధుడని పేర్కొన్నారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. చిరుకు రిటైర్మెంట్ ఉండదన్నారు. చిరంజీవి నటించిన 'ప్రాణం ఖరీదు' విడుదలై సోమవారానికి 47 ఏళ్లు. ఈ నేపథ్యంలో తన సుదీర్ఘ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టగా.. దానికి బదులిస్తూ అన్నయ్యపై అభిమానాన్ని చాటారు పవన్. 'ప్రాణం ఖరీదు'లో అన్నయ్య హీరోగా నటించిన రోజులు నాకు బాగా గుర్తున్నాయి. అప్పుడు మేం నెల్లూరులో ఉండేవాళ్లం. అప్పటికి నేను స్టూడెంట్ని. సినిమా చూసేందుకు కనకమహల్ థియేటరుకి వెళ్లినప్పుడు కలిగిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేను.

47 ఏళ్ల ప్రయాణంలో ప్రతి విషయంలోనూ అన్నయ్య ఎంతో ఎదిగారు. ఇప్పటికీ అదే వినయం. ఇతరులకు అండగా నిలవడం, సహాయం చేయడంలో ఎలాంటి మార్పూ రాలేదు. ఇలాగే ఎప్పుడూ విజయాలు అందుకోవాలని, ఆరోగ్యంగా ఉండాలని దుర్గామాతను ప్రార్థిస్తున్నా. భవిష్యత్తులో ఆయన్ను మరిన్ని విభిన్న పాత్రల్లో చూడాలని కోరుకుంటున్నా. అన్నయ్య అనుకుంటే తప్ప ఆయనకు రిటైర్మెంట్ అనేదే లేదు అని పవన్ పేర్కొన్నారు. పలు సందర్భాల్లో చిరంజీవితో కలిసి దిగిన ఫొటోలు పంచుకున్నారు. చిరంజీవి నటించిన తొలి సినిమా 'పునాది రాళ్లు' అయినప్పటికీ.. 'ప్రాణం ఖరీదు' తొలుత విడుదలైంది.

## విరామం వచ్చినా.. ఎంపికలు మారవు



'సినిమాల్లో మహిళల్ని శక్తిమంతంగా చూపించే కథల్నే ఎంచుకోవడానికి ప్రయత్నించా.. కొన్నేళ్లు విరామం వచ్చినంత మాత్రానా నా ఎంపికల్లో తేడా ఉండదు" అని అంటోంది బాలీవుడ్ తార సోనమ్ కపూర్. 'రాంఝానా', 'నీర్జా', 'ప్రేమ్ రతన్ ధన్ పాయో', 'వీర్ దే వెడ్డింగ్', 'ప్యాడ్ మ్యాన్' లాంటి వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని మెప్పించిన కథానాయికీమె. మాతృత్వపు దశను ఆస్వాదిస్తూ కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సోనమ్.. మళ్లీ తెరపై రావడానికి సిద్ధంగా ఉన్నానని చెప్తోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. "ఒక తల్లిగా వీలైనంత ఎక్కువ సమయం నా కొడుకు కోసం కేటాయించాలనుకున్నా. నా జీవితంలో ఈ అద్భుతమైన క్షణాల్ని ఆస్వాదించాలనుకున్నా. అందుకే సినిమాల నుంచి విశ్రాంతి తీసుకున్నా. ఈ దశ నన్ను మరింత బలంగా మార్చింది. ఓపికగా ఉండటం నేర్పించింది. ఇప్పుడు నేను ఇష్టపడే నా వృత్తి కోసం మళ్లీ సన్నద్ధమయ్యే సమయం వచ్చేసింది. కెమెరా ముందుకు రావడానికి ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. అమ్మ అయిన తర్వాత నా మొదటి ప్రాజెక్ట్ ఈ ఏడాది ఆఖర్లో ప్రారంభమవుతుంద"ని చెప్పుకొచ్చింది.

## మా పెద్దన్నయ్య ఓ ఫైటర్.. ఆయనకు రిటైర్మెంట్ లేదు: పవన్ కల్యాణ్




తన సోదరుడు, నటుడు చిరంజీవి పుట్టుకతోనే యోధుడని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయనకు రిటైర్మెంట్ ఉండదన్నారు. తెలుగు ప్రేక్షకులకు చిరంజీవిని పరిచయం చేసిన 'ప్రాణం ఖరీదు' సినిమా విడుదలై నేటికి 47 ఏళ్లు. తన సుదీర్ఘ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ చిరంజీవి సోమవారం ఉదయం ఎక్స్‌లో పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూ.. అన్నయ్యపై పవన్ కల్యాణ్ అభిమానం చాటారు. నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు.

**155 సినిమాలు పూర్తి చేశానంటే ఇదే కారణం: చిరంజీవి**

"ప్రాణం ఖరీదు'లో అన్నయ్య హీరోగా నటించిన రోజులు నాకు బాగా గుర్తున్నాయి. అప్పుడు మేం నెల్లూరులో ఉండేవాళ్లం. అప్పటికి నేను స్టూడెంట్‌ని. సినిమా చూసేందుకు కనకమహల్ థియేటర్‌కు వెళ్లినప్పుడు కలిగిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. 47 ఏళ్ల ప్రయాణంలో ప్రతి విషయంలోనూ అన్నయ్య ఎంతో ఎదిగాడు. ఇప్పటికీ అదే వినయం. ఇతరులకు అండగా నిలవడం, సహాయం చేయడంలో ఎలాంటి మార్పూ రాలేదు. ఇలాగే ఎప్పుడూ విజయాలు అందుకోవాలని, ఆరోగ్యంగా ఉండాలని దుర్గామాతను ప్రార్థిస్తున్నా. భవిష్యత్తులో ఆయన్ను మరిన్ని విభిన్న పాత్రల్లో చూడాలని కోరుకుంటున్నా. అన్నయ్య అనుకుంటే తప్ప ఆయనకు రిటైర్మెంట్ అనేదే లేదు" అని పేర్కొన్నారు. పలు సందర్భాల్లో చిరంజీవితో కలిసి దిగిన ఫొటోలు షేర్ చేశారు. చిరంజీవి నటించిన తొలి సినిమా 'పునాది రాళ్లు' అయినప్పటికీ.. 'ప్రాణం ఖరీదు' తొలుత విడుదలైంది.

పవన్ పోస్టు నేపథ్యంలో చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందించారు. "ప్రియమైన కల్యాణ్ బాబు.. నీ మాటలు నన్ను లోతుగా తాకాయి. మళ్లీ పాత రోజులకు తీసుకెళ్లాయి. 'ప్రాణం ఖరీదు' నుంచి నేటి వరకు వరకు అన్ని విషయాల్లోనూ కుటుంబం, స్నేహితులు, అభిమానులు, ప్రేక్షకుల నుంచి ఎంతో ప్రేమ, ప్రోత్సాహం లభించింది. వారి ప్రేమకు ఎంతో కృతజ్ఞుడిని. వారి మద్దతు, ప్రోత్సాహానికి చాలా ధన్యవాదాలు. 'ఓజీ' ట్రైలర్ నాకు బాగా నచ్చింది. చిత్రం భారీ విజయం సాధించాలి. 'ఓజీ' చిత్రబృందం నిజంగా దానికి అర్హులు" అని చిరంజీవి పేర్కొన్నారు.

## కాంతార లోపల బ్రహ్మరాక్షసుడు ఉన్నాడా?



ఓ చిన్న సినిమాలా ఎలాంటి అంచనాల్లేకుండా వెండితెరపైకి వచ్చి సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది 'కాంతార'. ఇప్పుడీ సినిమాకి ప్రీక్వెల్‌గా 'కాంతార: చాప్టర్ 1' సిద్ధమైంది. రిషబ్ శెట్టి హీరోగా నటిస్తూ... స్వయంగా తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా సినిమాని హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. రుక్మిణీ వసంత్ కథానాయిక. ఈ చిత్రం అక్టోబరు 2న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హీరో ప్రభాస్ ఈ చిత్ర తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. "నాన్న ఇక్కడే ఎందుకు మాయమయ్యాడు" అంటూ ఓ కుర్రాడు వేసే ప్రశ్నతో మొదలైన ట్రైలర్.. అందులో కనిపించిన సరికొత్త ప్రపంచం, ఓ అసాధారణ ప్రేమకథ, ఈశ్వరుడి నేపథ్యం, భారీ యుద్ధాలు..అన్నీ ఆసక్తి రేకెత్తించేలా ఉన్నాయి. 'కాంతార'లో లాగే ఈ కథలోనూ అడవి, దాన్ని నమ్ముకుని జీవించే గిరిజన తెగ, మట్టిపై వాళ్లకున్న మమకారం.. వాళ్ల సంప్రదాయాలు.. ఆ తెగను అణగదొక్కి వాళ్ల సంపదను దోచుకోవాలనుకునే దురాశపరుడైన రాజు.. లాంటి అంశాలన్నీ కనిపించాయి. "ఎప్పుడు మనిషి అధర్మం వైపు వెళ్తాడో.. ధర్మాన్ని కాపాడటానికి ఆ ఈశ్వరుడు తన గణాల్ని పంపుతూనే ఉంటాడు', 'కాంతార లోపలికి అస్సలు వెళ్లకూడదు పిల్లలు. అక్కడ బ్రహ్మరాక్షసుడు ఉన్నాడు" అంటూ ట్రైలర్‌లో వినిపించిన సంభాషణలు అంచనాలు పెంచేలా ఉన్నాయి. ఆఖర్లో ఈశ్వర అవతారంలో త్రిశూలంతో రిషబ్ కనిపించిన తీరు ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాకి అజనీశ్ లోక్‌నాథ్ సంగీతమందించగా.. అరవింద్ ఎస్ కశ్యప్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.

## రణ్‌బీర్‌పై చర్యలకు సిద్ధమైన మానవహక్కుల కమిషన్

షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ తొలి దర్శకత్వంలో రూపొందిన సిరీస్ 'బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్'. ఇందులో అతిథి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటించారు. ఇప్పుడు ఇందులో రణ్‌బీర్ నటించిన ఈసిగరెట్ సన్నివేశం వివాదాస్పదమైంది. ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టాన్ని బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ ఉల్లఘించారని జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) నటుడు, చిత్రనిర్మాతలు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై చట్టపరమైన చర్యలకు సిద్ధమైంది. నిషేధించిన ఉత్పత్తులను నెట్‌ఫ్లిక్స్ ఎలా చూపించిందని జాతీయ మానవ హక్కుల కమిషన్ కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శికి నోటీసులు జారిచేసింది. లీగల్ రైట్స్ అబ్జర్వేటరీ దాఖలు చేసిన ఫిర్యాదులో ఈ సిరీస్‌లో రణ్‌బీర్ కపూర్ ఎటువంటి చట్టబద్ధమైన హెచ్చరిక లేకుండా ఈసిగరెట్ తాగుతున్నట్లు చూపించారని తెలిపారు.నిషేధిత పదార్థాల వాడకాన్ని ప్రోత్సాహించడం ద్వారా యువ ప్రేక్షకులను తప్పుదారి పట్టించేలా ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని, ఇటువంటి బాధ్యతారహిత కంటెంట్ చట్టవిరుద్ధ కార్యకలాపాలను ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు ప్రియాంక్ కనూంగో మీడియాతో మాట్లాడుతూ "భారతదేశంలో ఈసిగరెట్ నిషేధిత చట్టం ప్రకారం ఏ వ్యక్తి కూడా ఈసిగరెట్లను ప్రోత్సహించకూడదు. వాటిని తయారు చేయడం, దిగుమతి చేసుకోవడం, అమ్మడం, నిల్వ చేయడం నేరం. సంబంధిత అంశాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి నటుడు, నిర్మాణ సంస్థ, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముంబయి పోలీసు కమిషనర్‌ను కోరాము"అని మీడియా ద్వారా తెలిపారు.



## స్పెయిన్ పిలుస్తోంది..



కథానాయకుడు రవితేజ.. దర్శకుడు కిశోర్ తిరుమల కలయికలో ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న ఈ సినిమా తదుపరి షెడ్యూల్ కోసం అక్టోబరు తొలి వారంలో స్పెయిన్‌కు వెళ్లనుంది. అక్కడ రవితేజతో పాటు మిగిలిన ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలతో పాటు పాటలు చిత్రీకరించనున్నట్లు సమాచారం. ఇది దాదాపు నెలకు పైగా సాగే సుదీర్ఘ షెడ్యూల్ అని తెలిసింది. వినోదంతో నిండిన ఈ కుటుంబ కథా చిత్రంలో స్పెయిన్ నేపథ్యానికి ప్రాధాన్యమున్న సంగతి తెలిసిందే. దీంట్లో రవితేజ స్టైలిష్ లుక్‌లో.. పూర్తి ఎంటర్‌టైనింగ్ పాత్రలో అలరించనున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే సంక్రాంతికి థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: ప్రసాద్ మూరెళ్ల.

## పోటీనే లేదు.. వైరం ఎక్కడిది?



దుబాయ్: భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ల్ని వైరం అంటూ పిలవడం మానేయాలని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. ఇద్దరు సమవుజ్జీలు తలపడితే వైరమని.. అసలు పాక్‌తో తమకు పోటీనే లేదని సూర్య తెలిపాడు. పాక్ విలేకరి అడిగిన ప్రశ్నకు సూర్య బదులిస్తూ.. "సర్.. భారత్, పాక్ మ్యాచ్‌లను వైరం అంటూ పిలవడం మానేయాలన్నది నా విజ్ఞప్తి. రెండు జట్లు 15 మ్యాచ్‌లాడితే.. చెరో ఏడు గెలిచినప్పుడు లేదా 8-7తో ఒకరు ఆధిక్యంలో ఉన్నప్పుడు వైరం అని అనొచ్చు. ఇక్కడ 12-3 ఆధిక్యం ఉంది. అసలు పోటీనే లేదు" అని చెప్పాడు.

ఒకరు ఫైర్.. ఇంకొకరు ఐస్... సూర్య: భారత టీ20 ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఫైర్, ఐస్ లాంటి వాళ్లని సూర్యకుమార్ అభివర్ణించాడు. "అభిషేక్-శుభ్‌మన్‌లది ఫైర్-ఐస్ కలయిక. వాళ్లిద్దరూ ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగుతారు. ఒకరు ఎదురుదాడి చేస్తుంటే ఇంకొకరు స్ట్రైక్ రొటేట్ చేస్తారు. మైదానం బయట అభిషేక్-శుభ్‌మన్ మంచి స్నేహితులు. వాళ్లిద్దరి మధ్య అనుబంధం మైదానంలోనూ కనబడుతుంది. ఒక్కోసారి చిన్న సైగ చాలు వేగంగా ఒక సింగిల్ తీసేయడానికి. క్రీజులో ఒకరు ఇబ్బందిపడుతుంటే మరొకరు సాయం చేస్తారు. స్నేహితులు కలిసి బ్యాటింగ్ చేస్తే వాళ్ల సమన్వయం వేరేలా ఉంటుంది. అభిషేక్ పవర్‌ప్లేలో చాలా దూకుడుగా ఆడతాడు. పవర్ ప్లే ముగిశాక తెలివిగా పరుగులు సాధిస్తాడు. ఇక శుభ్‌మన్ బ్యాటింగ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు" అని సూర్య తెలిపాడు. అండర్-12 రోజుల నుంచి అభిషేక్, శుభ్‌మన్ కలిసి ఆడుతున్నారు. కొవిడ్ సమయంలో యువరాజ్ సింగ్ కనుసన్నల్లో ఇద్దరూ సాధన చేశారు. పాక్‌తో మ్యాచ్‌లో అభిషేక్ 74.. శుభ్‌మన్ 47 పరుగులు చేశారు. తొలి వికెట్‌కు 105 పరుగులు జత చేసి విజయానికి గట్టి పునాది వేశారు.

# మా ఆటే మాట్లాడుతుంది



భారత్, పాకిస్థాన్ మ్యాచ్ అంటే హోరాహోరీ అన్నది ఒకప్పటిమాట. చాలా ఏళ్లుగా టీమ్‌ఇండియానే తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ వస్తోంది. చిరకాల ప్రత్యర్థిపై వరుసగా నెగ్గుతూనే ఉంది. పాకిస్థాన్ గెలిస్తే.. అది పెద్ద విశేషమే. ఆసియాకప్ టీ20లోనూ అదే కథ. ఈ టోర్నీలో ఇప్పటికే రెండు సార్లు ఆ జట్టును మట్టికరిపించింది టీమ్‌ఇండియా. అభిషేక్, గిల్‌ల వీరవిహారంతో ఆదివారం భారత్ విజయాన్నందుకుంది. అయితే వరుస పరాజయాలు చవిచూస్తున్నా కాస్తయినా బుద్ధి తెచ్చుకోకుండా, ఆట మీద దృష్టిపెట్టకుండా భారత జట్టును మైదానంలో కవ్విస్తోంది పాకిస్థాన్. ఆదివారం మ్యాచ్ సందర్భంగా అర్ధసెంచరీ పూర్తయ్యాక పాక్ బ్యాటర్ ఫర్హాన్ అతిగా స్పందించాడు. భారత్‌ను రెచ్చగొట్టేలా గన్‌ఫైరింగ్ సంబరాలు చేసుకున్నాడు. ఇది ఇంటర్నెట్లో వైరల్ అయింది. మరోవైపు బౌండరీ వద్ద మరో పాక్ ఆటగాడు రవూఫ్ చర్యలు కూడా వివాదాస్పదమయ్యాయి. భారత అభిమానుల వైపు చూస్తూ 60, యుద్ధ విమానాల సంజ్ఞలు చేశాడు. ఆపరేషన్ సిందూర్‌తో చాలా నష్టపోయినా.. తాము భారత్‌కు చెందిన ఆరు యుద్ధవిమానాలను కూల్చామంటూ పాక్ తప్పుడు ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. భారత ఆటగాళ్లు కూడా దీనికి స్పందించారు. మైదానంలో వాళ్లను చితక్కొట్టిన అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ సోషల్ మీడియాలో కూడా గట్టిగా బదులిచ్చారు. ''మాటలు కాదు.. మా ఆటే మాట్లాడుతుంది'' అని గిల్ అంటే.. ''మీరు మాట్లాడతారు.. మేం గెలుస్తాం'' అని అభిషేక్ పేర్కొన్నాడు.

మ్యాచ్‌కు సంబంధించిన నాలుగు చిత్రాలను అభిషేక్ పంచుకున్నాడు. ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఈ ఇద్దరు ఆటగాళ్లు పాక్ బౌలింగ్‌ను తుత్తునియలు చేసిన సంగతి తెలిసిందే. అభి కేవలం 39 బంతుల్లో 74 పరుగులు చేస్తే.. గిల్ 28 బంతుల్లోనే 47 పరుగులు సాధించాడు. బ్యాటుతో నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డ అభిషేక్.. పాక్ పేసర్లు షహీన్ షా అఫ్రిది, హారిస్ రవూఫ్‌లతో మాటల యుద్ధానికి కూడా దిగాడు. వాళ్లు అకారణంగా తమతో గొడవ పెట్టుకోవడానికి ప్రయత్నించారని మ్యాచ్ అనంతరం అతడు వ్యాఖ్యానించాడు.

ఎవరేమనుకున్నా నేను పట్టించుకోను.. ఫర్హాన్: గన్‌ఫైరింగ్ సంబరాలతో క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించిన పాక్ బ్యాటర్ ఫర్హాన్ తన చర్యలకు ఏమాత్రం విచారించట్లేదు. పైగా జనం ఏమనుకున్నా తాను పట్టించుకోనని వ్యాఖ్యానించాడు. ''ఆ క్షణంలో అలా సంబరాలు చేసుకోవాలనిపించింది. సాధారణంగా 50కి చేరుకున్నప్పుడు నేను పెద్దగా సంబరాలు చేసుకోను. కానీ ఈ రోజు హఠాత్తుగా అలా చేయాలనిపించింది. జనం దీని గురించి ఏం మాట్లాడుకుంటారో తెలియదు. వాళ్లేం మాట్లాడుకున్నా లెక్క చేయను'' అని మ్యాచ్ అనంతరం ఫర్హాన్ వ్యాఖ్యానించాడు. ''భారత్‌తోనే కాదు. ఏ జట్టుతోనైనా ఆడినా దూకుడుగానే ఆడాలి'' అని అన్నాడు

# గుజరాత్‌పై బెంగళూరు విజయం



జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్‌లో సోమవారం బెంగళూరు బుల్స్ 2824తో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. విరామానికి 1713తో ఆధిక్యంలో ఉన్న బెంగళూరు.. ఆ తర్వాత కూడా ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఆధిక్యాన్ని 2316కు పెంచుకుంది. గుజరాత్ గట్టిగా ప్రయత్నించినప్పటికీ కీలక సమయాల్లో బెంగళూరు డిఫెన్స్ బలంగా నిలిచింది. బుల్స్ తరపున ఆకాశ్ షిండే (7), యోగేశ్ (6) రాణించారు. గుజరాత్ తరపున విశ్వనాథ్, లక్కీ శర్మ చెరో అయిదు పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 3922తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది. యూపీ తరపున గగన్ గౌడ (7), భవాని రాజ్‌పుత్ (6) సత్తా చాటారు. తలైవాస్ జట్టులో నితేశ్ కుమార్ (7) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

# ప్రణయ్‌కి కొరియా పరీక్ష



సువాన్ (కొరియా): పేలవమైన ఫామ్‌తో సతమతమవుతున్న భారత అగ్రశ్రేణి ఆటగాడు హెచ్.ఎస్.ప్రణయ్‌కి మరో పరీక్ష ఎదురుకానుంది. మంగళవారం ప్రారంభంకానున్న కొరియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో సత్తాచాటాలని ప్రణయ్ భావిస్తున్నాడు. పురుషుల సింగిల్స్‌లో క్వాలిఫయర్‌తో ప్రణయ్, లీ యాంగ్ (చైనీస్ తైపీ)తో ఆయుష్ శెట్టి, లో కీన్ యూ (సింగపూర్)తో కిరణ్ జార్జ్ తమ పోరాటాన్ని మొదలుపెట్టనున్నారు. హాంకాంగ్ ఓపెన్, చైనా మాస్టర్స్‌లో ఫైనల్ చేరుకున్న స్టార్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి ఈ టోర్నీకి దూరంగా ఉన్నారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో పుత్రి కుసుమర్దని (ఇండోనేసియా)తో అనుపమ ఉపాధ్యాయ తలపడనుంది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో యూచి షిమోగామి- సయాక హోబారా (జపాన్) జంటతో మోహిత్ జగ్లాన్- లక్షిత జగ్లాన్ జోడీ పోటీపడనుంది.

## ఫుట్‌బాల్ ఆడేందుకు భారత్‌కు బోల్ట్



ముంబయి: జమైకా స్ప్రింట్ దిగ్గజం ఉసేన్ బోల్ట్ భారత్‌కు రాబోతున్నాడు. అతడొస్తోంది అథ్లెటిక్స్ కోసం కాదు ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడేందుకు! అక్టోబర్ 1న జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్ కోసం ముంబయిలో అడుగుపెట్టనున్నాడు. ఈ మ్యాచ్‌లో ఫుట్‌బాల్ ఆటగాళ్లతో పాటు బాలీవుడ్ తారలు, వివిధ రంగాలకు చెందిన సెలబ్రెటీలు పాల్గొంటారు. బెంగళూరు ఎఫ్‌సీ, ముంబయి ఎఫ్‌సీ మధ్య ఈ పోరు జరగనుంది. బోల్ట్ తొలి అర్ధభాగంలో ఒక జట్టు తరపున.. ద్వితీయార్ధంలో ఇంకో జట్టు తరపున ఆడబోతున్నాడు. అథ్లెటిక్స్ కాకుండా బోల్‌ట్‌కు ఫుట్‌బాల్, క్రికెట్ అంటే చాలా ఇష్టం. రికార్డు స్థాయిలో ఎనిమిది ఒలింపిక్ స్వర్ణ పతకాలు గెలుచుకున్న అతడు.. 2017లో అథ్లెటిక్స్‌కు వీడ్కోలు పలికాడు.

## డికాక్ మళ్లీ వచ్చాడు


జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా వికెట్‌కీపర్ క్వింటాన్ డికాక్ వన్డేల నుంచి రిటైర్‌మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు. త్వరలో పాకిస్థాన్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లో పాల్గొనే దక్షిణాఫ్రికా జట్టులో అతడు చోటు దక్కించుకున్నాడు. నమీబియాతో ఏకైక టీ20లోనూ అతడు ఆడబోతున్నాడు. 2023 వన్డే ప్రపంచకప్ అనంతరం డికాక్ 50 ఓవర్ల ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. 2024 టీ20 ప్రపంచకప్ తర్వాత పొట్టి క్రికెట్లోనూ కనిపించలేదు. "డికాక్ తిరిగి రావడం దక్షిణాఫ్రికాకు ఎంతో బలాన్ని ఇస్తోంది. గత నెలలో అతడితో మాట్లాడినప్పుడు దేశానికి ఆడాలనే కోరిక ఇంకా ఉన్నట్లు వెల్లడించాడు. అతడి రాక జట్టుకు మేలు చేయనుంది'' అని కోచ్ షుక్రి కాన్రాడ్ తెలిపాడు. సఫారీ జట్టు తరపున ఇప్పటిదాకా 155 వన్డేలు ఆడిన డికాక్.. 45.74 సగటుతో 6770 పరుగులు చేశాడు. 92 టీ20ల్లో 2584 పరుగులు సాధించాడు. మరోవైపు పాకిస్థాన్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు కెప్టెన్ టెంబా బవుమా గాయంతో దూరమయ్యాడు. అతడి గైర్హాజరీలో మార్‌క్రమ్ జట్టును నడిపించనున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా అక్టోబర్ 12న పాక్‌తో మొదలయ్యే తొలి టెస్టుతో 2025 26 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ చక్రాన్ని ప్రారంభించబోతోంది.

## దివ్యకు వైల్డ్‌కార్డ్



దిల్లీ: ఫిడె ప్రపంచకప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్‌కు వైల్డ్‌కార్డ్ లభించింది. ఇటీవల మహిళల ప్రపంచకప్ విజేతగా నిలిచిన దివ్యకు అధ్యక్షుడు అర్కాడీ డ్వోర్కోవిచ్ వైల్డ్‌కార్డ్ ఇచ్చినట్లు ఫిడె వెల్లడించింది. ప్రపంచ మాజీ ఛాంపియన్ హూ యిఫాన్ (చైనా) వైల్డ్‌కార్డ్ ఆహ్వానాన్ని తిరస్కరించడం.. ప్రస్తుత ఛాంపియన్ జు వెన్‌జున్ (చైనా) ఎంట్రీని చివరి నిమిషంలో రద్దు చేసుకోవడంతో దివ్యకు అవకాశం లభించింది. అక్టోబరు 30న గోవాలో ఫిడె ప్రపంచకప్ ప్రారంభంకానుంది

# ఫుట్‌బాల్‌లోనూ భారత్‌దే గెలుపు



కొలంబో: శాఫ్ అండర్-17 ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ అదరగొట్టింది. సోమవారం 3-2తో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. 31వ నిమిషంలో గాంగ్టే గోల్‌తో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే ఓ పెనాల్టీని పాక్ ఆటగాడు అబ్దుల్లా (43వ) సద్వినియోగం చేసి స్కోరు సమం చేశాడు. ఆ తర్వాత భారత్-పాక్ చెరో గోల్ చేయడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. భారత్ తరఫున గన్‌లెబా (63వ ని).. పాక్‌కు హంజా (70వ ని) గోల్ కొట్టడంతో స్కోరు 2-2గా మారింది. తర్వాత భారత్ దూకుడు పెంచింది. 73వ నిమిషంలో రెహాన్ అహ్మద్ సఫలం కావడంతో మళ్లీ ఆధిక్యం సాధించింది. ఆఖరిదాకా పాక్‌ను మరో గోల్ కొట్టనీయకుండా అడ్డుకుని విజయాన్ని అందుకుంది. భారత్, పాక్ ఈ టోర్నీలో ఇప్పటికే సెమీస్‌కు అర్హత సాధించాయి. పాక్‌కు తొలి గోల్ అందించిన తర్వాత అబ్దుల్లా టీ తాగుతున్నట్లుగా సంబరం చేసుకోవడంతో సామాజిక మాధ్యమాల్లో విమర్శలు ఎదురవుతున్నాయి. తాజాగా ఆసియా కప్‌లో భారత్‌తో మ్యాచ్‌లో పాక్ బ్యాటర్ ఫర్హాన్ గన్‌ఫైర్ సంబరం వివాదాస్పదం అయిన ఒక్క రోజులోనే ఫుట్‌బాల్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది.

## బెంగాల్ క్రికెట్ అధ్యక్షుడిగా సౌరభ్ గంగూలీ.. ఏకగ్రీవంగా ఎన్నిక



భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ మళ్లీ బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. సోమవారం జరిగిన క్యాబ్ 94వ వార్షిక సర్వసభ్య సమావేశంలో గంగూలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 20152019 మధ్య క్యాబ్ అధ్యక్షుడిగా వ్యవహరించిన దాదా.. మళ్లీ ఆరేళ్ల తర్వాత ఆ పదవికి ఎన్నికయ్యాడు. ఈడెన్ గార్డెన్స్ సామర్థ్యాన్ని లక్షకు పెంచడం, వచ్చే ఏడాది జరగనున్న టీ20 ప్రపంచ కప్‌లో కీలకమైన మ్యాచ్‌లకు ఈడెన్ ఆతిథ్యమిచ్చేలా చూడటంపై గంగూలీ దృష్టిసారించనున్నాడు. మరోవైపు, ఈ మైదానంలో ఈ నవంబర్ 14 నుంచి భారత్, సౌతాఫ్రికా మధ్య టెస్టు మ్యాచ్ ప్రారంభంకానుంది. ఈడెన్‌లో ఆరేళ్ల తర్వాత జరగనున్న టెస్టు మ్యాచ్ ఇది. ఇక్కడ చివరగా 2019 నవంబర్‌లో భారత్, బంగ్లా మధ్య పింక్ బాల్ (డే/నైట్) టెస్టు జరిగింది. అప్పుడు గంగూలీ బీసీసీఐ అధ్యక్షుడిగా ఉన్నాడు.

ఫర్హాన్ ఏకే 47 పేలిస్తే.. అభిషేక్, గిల్ ఏకంగా బ్రహ్మోస్ ప్రయోగించారు: పాక్ మాజీ క్రికెటర్

త్వరలో భారత్, సౌతాఫ్రికా మధ్య జరగనున్న టెస్టు మ్యాచ్ గురించి గంగూలీ మాట్లాడాడు. 'రెండూ అగ్రశ్రేణి జట్లే. ఇది మంచి టెస్టు మ్యాచ్ అవుతుందని నేను కచ్చితంగా అనుకుంటున్నాను. మ్యాచ్‌కు ఇంకా రెండు నెలల సమయమే ఉంది. ఏర్పాట్ల గురించి త్వరలో బీసీసీఐతో మాట్లాడతా. ఈడెన్ గార్డెన్స్ సీటింగ్ కెపాసిటీ పెంచడం అంటూ ఉంటే అది వచ్చే ఏడాది జరగనున్న టీ20 ప్రపంచ కప్ తర్వాతే' అని గంగూలీ పేర్కొన్నాడు. ఈడెన్‌లో మొదట లక్షకు పైగా సామర్థ్యం ఉండేది. కానీ దానిని 68,000కు తగ్గించారు. 2011 ప్రపంచ కప్‌నకు ముందు ఈ మార్పు చేపట్టారు.